మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శనివారం 17 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 316



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609



Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District




# ఢిల్లీలో మళ్లీ టెన్షన్

- సీజేపీ నేత అభిజీత్ దీప్, ఏఐఎస్పీ చీఫ్ నేహా బోరా నిర్బంధం
- 150 మందికిపైగా ఆందోళనకారుల అదుపులోకి
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు
- నేతల అరెస్టులకు నిరసనగా కదం తొక్కిన సంఘాలు
- కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ చుట్టూ భారీ బందోబస్తు
- టియర్ గ్యాస్, వజ్ర వాహనాలతో పోలీసుల అప్రమత్తత
- 'నేను ఏ చట్టాన్ని ఉల్లంఘించాను?' అని దీప్ ప్రశ్న

03

## 'లెహ్రా దో తిరంగా' ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా, తమ నేతల అరెస్టులకు నిరసనగా సీజేపీ చేపట్టిన 'లెహ్రా దో తిరంగా' ఆందోళనను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్తో పాటు ఏఐఎస్పీ అధ్యక్షురాలు నేహా బోరాను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ చుట్టూ భారీగా పోలీసులను మోహరించి, ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. మెరుపు నిరసనలు, వరుస ర్యాలీలతో రాజధానిలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, ఇప్పటివరకు 150 మందికి పైగా నిరసనకారులను పోలీసులు నిర్బంధించారు.

## నామినేషన్ల తొలిరోజే

# రణరంగం

### పుంగనూరు, రాయచోటిలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణలు

- పరిస్థితిని అదుపు చేసేందుకు పుంగనూరులో పోలీసుల గాల్లోకి కాల్పులు
- రాళ్లదాడిలో పలువురికి గాయాలు.. ధ్వంసమైన వాహనాలు
- రాయచోటిలో సుమారు 15 కార్లు ధ్వంసం.. నాలుగింటికి నిప్పు
- తిరుపతిలోనూ నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత
- టీడీపీ నేత మధు రాయల్‌పై దాడి జరిగిందని ఆరోపణ
- నామినేషన్ల అడ్డగింపుపై వైసీపీ ఫిర్యాదు
- ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి

**అమరావతి,**
: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజే పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు దారితీసింది. అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురు గాయపడగా, వాహనాలు ధ్వంసమయ్యాయి. -మిగతా 3 లో





03

## డీలిమిటేషన్ బిల్లుకు

# మళ్లీ కసరత్తు!

- ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే యోచన
- కేంద్ర వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు
- 2029 ఎన్నికలకు ముందే కీలక బిల్లులకు ఆమోదం పొందాలని ప్రయత్నం
- నియోజకవర్గాల పునర్విభజనతోపాటు మహిళా బిల్లుపైనా దృష్టి
- రాజకీయ సమీకరణాల్లో మార్పులతో మద్దతు కూడగట్టే వ్యూహం
- డీఎంకే, ఎన్సీపీ (ఎస్పీ)తో సంప్రదింపులపై ప్రచారం
- రాజ్యాంగ సవరణ బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి



03

## ఇండియా కూటమి నిరసనల్లోకి విజయ్ పార్టీ!



# ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది..

- పుంగనూరులో ఎంపీపై దాడి జరిగిందని వైసీపీ అధినేత ఆరోపణ
- చంద్రబాబే ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- వైసీపీ అభ్యర్థుల నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శ
- ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని వ్యాఖ్య
- మిథున్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించిన జగన్
- కాన్వాయ్‌పై రాళ్లు, కర్రలతో దాడి చేశారని వైసీపీ వర్గాల ఆరోపణ

**అమరావతి,**
రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై పుంగనూరులో దాడి జరిగిందన్న వార్తలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హింసను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుండటంతోనే అధికార కూటమి దాడులకు పాల్పడుతోందని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైసీపీ అభ్యర్థులు, నాయకులను అడ్డుకుంటున్నారని జగన్ ఆరోపించారు. పార్టీ లోక్‌సభా పక్ష నేతకే రక్షణ కల్పించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఓటమి భయంతోనే అధికార పక్షం దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు -మిగతా 3 లో

## టెస్లా ఫ్లయింగ్ కార్ వచ్చేసింది.



02



03

## ప్రభుత్వాన్ని కూల్చేందుకే

# ఆందోళనలు

- పతిపక్షాల ఆందోళనలపై కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శలు
- ప్రభుత్వాన్ని కూల్చడమే ఇండియా కూటమి లక్ష్యమని ఆరోపణ
- యువతను రాజకీయ ప్రయోజనాల కోసం పావులుగా వాడుకుంటున్నారని వ్యాఖ్య
- రాజ్యాంగ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నమని విమర్శ
- ఎస్ఐఆర్ రద్దు, సీఈసీ రాజీనామా డిమాండ్లపై స్పందన
- ప్రజాస్వామ్యం పేరుతో ప్రభుత్వాన్ని అస్థిరపరచలేరని వ్యాఖ్య
- 1975 అత్యవసర పరిస్థితిని ప్రస్తావించిన రక్షణ మంత్రి

## సిరీస్ దక్కేదెవరికో?




03



## తెలుగు రాష్ట్రాలకు

# వర్ష సూచన!

- ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వానలు కురిసే అవకాశం
- తెలంగాణలో పలు జిల్లాలకు వర్ష సూచన
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వర్షాలు
- ఖమ్మం, వరంగల్, హనుమకొండలోనూ కురిసే ఛాన్స్
- నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకూ సూచన
- ఏపీలోనూ అక్కడక్కడా చిరుజల్లులు, మోస్తరు వర్షాలు
- ఎండలు, ఉక్కపోత నుంచి ఉపశమనం లభించే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారుల సూచన

**తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:**
ఎండలు, ఉక్కపోతతో సతమతమవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వానలు పడే అవకాశముందని అంచనా వేసింది. హైదరాబాద్, -మిగతా 3 లో

## స్థానిక సమరానికి

# టీడీపీ సై

### అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం



- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి
- అభ్యర్థుల ఎంపికను పర్యవేక్షిస్తున్న చంద్రబాబు
- లోకేశ్, పల్లా శ్రీనివాసరావుకు కీలక బాధ్యతలు
- క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదానికి ప్రాధాన్యం
- నాయకత్వ లక్షణాలు, వ్యక్తిగత ప్రతిష్ఠ ఆధారంగా వడపోత
- మేయర్లు, ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికతో ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ
- కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు పూర్తి
- స్థానిక సంస్థల్లోనూ పట్టు సాధించి అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

**అమరావతి,**
ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలతోపాటు క్షేత్రస్థాయిలో ప్రజల స్పందనను పరిగణనలోకి తీసుకుంటున్నారు. అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవలో చురుకుదనం వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈసారి మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ కేడర్‌లో పట్టుతోపాటు ప్రజల్లోనూ ఆదరణ ఉన్నవారిని ఎంపిక చేయాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా పరిస్థితులను విశ్లేషించి తుది నిర్ణయం తీసుకునేందుకు ప్రయత్నిస్తోంది.

కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే

# అమెరికా-పాక్ మధ్య యుద్ధం వస్తే బీజేపీ పాక్‌వైపే



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
ఒక వేళ యూఎస్-పాకిస్థాన్ మధ్య యుద్ధం ఏర్పడితే భౌగోళిక సామీప్యత దృష్ట్యా బీజేపీ.. పొరుగుదేశమైన పాకిస్థాన్‌కే మద్దతు ఇస్తుందని రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు మదన్ రాథోడ్ తెలిపారు.ఒక బహిరంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'అమెరికా-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధం కనుక వస్తే బీజేపీ ప్రభుత్వం పాకిస్థాన్ తరపునే ఉంటుంది, అది మన పొరుగుదేశం.' అని పేర్కొన్నారు. 'కానీ మన మధ్య ఏదైనా సమస్య తలెత్తినప్పుడు మనం భారతదేశం పక్షాన నిలబడతాం కదా. మనం అర్థం చేసుకోవాల్సింది ఇదే.' అని ఆయన తెలిపారు. బీజేపీ నేత వ్యాఖ్యలపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు మండిపడ్డాయి.

# నిరసనలతో ఈసీ వెనుకడుగు

**24 గంటల్లో రెండు కీలక చర్యలపై ఉత్తర్వులు**

**17 రాష్ట్రాలు, యూటీల్లో 'సర్'కు బదులుగా ఎస్ఎస్ఆర్ అమలు**

**రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాల పీడీఎఫ్ కాపీలపై హామీ**



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
: ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ప్రక్రియపై తీవ్ర నిరసనల నేపథ్యంలో ప్రతిపక్షాలతో దీర్ఘకాలంగా విభేదాలకు కారణమవుతున్న రెండు అంశాలపై ఎన్నికల సంఘం తన వైఖరిని మార్చుకున్నట్టు కనిపిస్తున్నది. గడచిన కొంత కాలంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్నికల సంఘం గత 24 గంటల్లో రెండు ప్రధాన నిర్ణయాలను తీసుకున్నది. అందులో భాగంగా కొత్త ఓటర్లను నమోదు చేసేందుకు 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సారాంశ సమీక్ష(ఎస్ఎస్ఆర్)ప్రక్రియను చేపడుతున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా మొదటిసారిగా ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు తుది ఓటర్ల జాబితాలకు చెందిన శోధించగలిగే పీడీఎఫ్ ప్రతులను అందచేస్తామని హామీ ఇచ్చింది.తద్వారా ఇంతకాలం తాను అనుసరిస్తూ వచ్చిన పాత వైఖరిని మార్చుకుంది. ఈ రెండు అంశాలను ఇటీవలి సంవత్సరాలలో ప్రతిపక్షాలు పదేపదే లేవనెత్తాయి. 2018లో కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన తర్వాత గోప్యతా సమస్యలను ఉటంకిస్తూ యంత్రాలు చదవగలిగే ఓటర్ల జాబితాలను విడుదల చేయడాన్ని ఈసీఐ స్వయంగా వ్యతిరేకించింది. కాగా, ఇప్పుడు తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని తానే మార్చుకున్నట్టు సూచించింది. ఇప్పటివరకు ఈసీఐ కేవలం చిత్రం మాత్రమే ఉన్న లేదా స్కాన్ చేసిన పీడీఎఫ్‌లను మాత్రమే అందించింది. వీటిలో శోధించడం సాధ్యం కాదు. సాధారణంగా వీటిలోని పదాలు ఎంచుకోవడం, శోధించడం లేదా కాపీ చేయడం కూడా కుదరదు.

# డ్రగ్స్‌ను అడ్డుకున్నందుకు పంజాబ్‌లో మరో హత్య



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమకారుడు పర్వీందర్ సింగ్ ఝెుటా దారుణ హత్య మరువక ముందే అదే తరహాలో మరో దారుణం చోటుచేసుకుంది. పంజాబ్‌లోని శ్రీహరిగోవింద్‌పూర్ పరిధిలోని పన్నవాన్ గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలను అడ్డుకున్నందుకు బిక్రమ్ సింగ్(40)తో పాటు మరో ఇద్దరిపై దుండగులు పదునైన ఆయుధంతో దాడి చేశారు.ఈ దాడిలో సింగ్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఔషధ షాపుల్లో మత్తు కలిగించే పదార్థాల అక్రమ విక్రయాలపై ఝెుటా మాన్సాలోని ఒక మెడికల్ స్టోర్‌లో ఫేస్‌బుక్ లైవ్ నిర్వహిస్తుండగా హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

# కోర్సు మధ్యలో ఫీజులు పెంచరాదు

**-అడ్మిషన్‌కు ముందే ఫీజు వివరాలు విద్యార్థులకు చెప్పాలి**

**-ప్రైవేట్ ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలకు సుప్రీంకోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
పెరుగుతున్న ఉన్నత విద్య ఖర్చుల కోసం ప్రణాళికలు వేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, వారి కుటుంబాలకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. అసాధారణ పరిస్థితులలో తప్ప ప్రైవేట్ వృత్తి విద్యా కళాశాలలు కోర్సు మధ్యలో ఫీజులను పెంచకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది. విద్యార్థులు ప్రవేశం తీసుకునే ముందే కోర్సు మొత్తం కాలానికి వారు చెల్లించాల్సిన ఫీజుల గురించి కళాశాలలు స్పష్టత ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది. ప్రవేశం తర్వాత అసాధారణ పరిస్థితులలో మాత్రమే ఫీజుల పెంపునకు అనుమతి ఇవ్వాలని కోర్టు పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లోని డాక్టర్ బీసీ రాయ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులపై విధించిన 37 శాతం ఫీజు పెంపును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఫీజుల విషయంలో నెలకొన్న అనిశ్చితి విద్యార్థులు, వారి కుటుంబాలపై గణనీయమైన ఆర్థిక భారాన్ని మోయగలదని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం తెలిపింది. వృత్తి విద్యా నియంత్రణకు బాధ్యత వహించే అధికారులు విద్యార్థులు కళాశాలలో చేరడానికి ముందే తమ ఆర్థిక బాధ్యతలను తెలుసుకునేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు నొక్కిచెప్పింది.వృత్తి విద్యా కోర్సుల ఫీజులు సాధారణ కోర్సుల ఫీజుల కంటే 711 శాతం ఎక్కువగా ఉన్నాయని తెలిపే నివేదికలను న్యాయస్థానం ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి కుటుంబాలు తాము చెల్లించాల్సిన ఫీజు మొత్తంలో ప్రవేశం పొందిన తర్వాత వచ్చే ఊహించని మార్పులకు లోనుకాకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఆర్థిక అనిశ్చితి విద్యార్థుల చదువుపై ప్రభావం చూపవచ్చని, దీర్ఘకాలంలో ఇది భవిష్యత్తులో వృత్తి నిపుణుల నాణ్యత, వ్యక్తిత్వాలపై పరిణామాలకు దారితీయవచ్చని కూడా ధర్మాసనం హెచ్చరించింది. వృత్తి విద్యను అభ్యసించడానికి చాలా భారతీయ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని కోర్టు అభిప్రాయపడింది. తమ పిల్లలు మంచి ఉద్యోగాలు సంపాదించి, మరింత సురక్షితమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఇది దోహదపడుతుందనే ఆశతో తల్లిదండ్రులు తరచుగా వారి చదువు కోసం సంవత్సరాల తరబడి పొదుపు చేస్తారని పేర్కొంది.వృత్తి విద్యా కోర్సుల కోసం చెల్లించడానికి చాలా కుటుంబాలు విద్యా రుణాలపై కూడా ఆధారపడతాయని తెలిపింది. ఊహించని ఫీజు పెరుగుదల వారి ఆర్థిక ప్రణాళికను దెబ్బతీస్తుందని పేర్కొంది.

# కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు..

**మనీ లాండరింగ్ కేసులో అక్టోబర్ 23న విచారణ**



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షాకిచ్చింది. సీఎంఎల్ఆర్ మనీ లాండరింగ్ కేసులో నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 23న విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. మనీలాండరింగ్ కేసులో కేరళ హైకోర్టును ఈడీ ఆశ్రయించింది. దీనిపై స్పందించిన కోర్టు.. ఈ కేసులో మాజీ సీఎం విజయన్‌తోపాటు ఆయన కూతురు వీణా విజయన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది.ఈ నేపథ్యంలో కేసు విచారణ కోసం కోచిలోని తమ కార్యాలయంలో అక్టోబర్ 23న హాజరు కావాలని విజయన్‌ను ఈడీ ఆదేశించింది. అయితే, తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ విజయన్ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. ఈ ఏడాది మేలో ఈడీ అధికారులు సీఎంఆర్ఎల్ సంస్థ ప్రమోటర్లపై దాడులు జరిపారు. దీనిలో భాగంగా విజయన్ కూతురు వీణా విజయన్ ఇంటిపై కూడా దాడులు జరిపారు. ఈ సందర్భంగా కొన్ని కీలక డాక్యుమెంట్లు లభించాయి. ఇండియా నుంచి భారీ ఎత్తున డబ్బు దుబాయ్, విదేశాలకు తరలించినట్లుగా ఆ డాక్యుమెంట్లలో ఉంది. 3.49 లక్షల యూఏఈ దిర్హామ్స్ (రూ.85 లక్షలు) దుబాయ్‌కు తరలించారు. అలాగే, ఇండియా నుంచి రూ.20.05 కోట్ల భారత కరెన్సీ కూడా విదేశాలకు తరలించారు. హవాలా లావాదేవీల ద్వారా ఈ సొమ్మును విదేశాలకు తరలించినట్లు ఈడీ అనుమానిస్తోంది. విజయన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయన పాత్రపై కూడా ఈ విషయంలో అనుమానాలున్నాయి. ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎల్ సంస్థకు లబ్ధి చేకూరినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ అంశంపై విచారించేందుకు ఈడీ సిద్ధమైంది. పినరయి విజయన్, వీణా విజయన్‌పై కేసు నమోదు చేయాలని కోర్టును ఈడీ ఆశ్రయించింది. దీంతో తాజాగా పినరయి విజయన్‌కు సమన్లు జారీ చేసింది.

# రాత్రివేళల్లోనూ సూర్యకాంతి..

**. అవసరమైనప్పుడు, అవసరమైన చోట సౌర వెలుగులు**

**అమెరికాకు చెందిన రిఫ్లెక్ట్ ఆర్బిటాల్ సంస్థ ప్రణాళికలు**

**హైదరాబాద్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్‌తో ఒప్పందం**



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
త్వరలో రాత్రివేళల్లోనూ సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. అవసరమైనప్పుడు, అవసరమైన చోట సూర్యకాంతిని విక్రయిస్తామని అమెరికా కంపెనీ చెబుతున్నది. ఈ ప్రాజెక్టు కోసం హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ స్కైరూట్‌తో కాలిఫోర్నియాకు చెందిన రిఫ్లెక్ట్ ఆర్బిటాల్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. రాత్రి వేళల్లోనూ భూమిపై నిర్దిష్ట ప్రాంతాలకు అవసరమైనప్పుడు సూర్యకాంతిని అందించేందుకు ఈ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇందుకోసం కక్ష్యలో భారీ ప్రతిబింబ అద్దాలతో కూడిన ఉపగ్రహాలను ప్రవేశపెట్టనుంది. ఈ ఉపగ్రహ ప్రయోగాల కోసం స్కైరూట్ ఏరోస్పేస్ సేవలను వినియోగించుకోనున్నది.

**ప్రయోజనాలు ఇవీ..**

విపత్తులు సంభవించిన ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు, గాలింపు కార్యక్రమాలకు వెలుతురు అందించడం, సౌరవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి సమయాన్ని పొడిగించడం వంటి అవసరాలకు ఈ సాంకేతికతను వినియోగించాలని సంస్థ భావిస్తున్నది. ఐదు కిలోమీటర్ల వెడల్పు గల ప్రాంతంలో అవసరమైనంత వెలుతురును అందించడం, దాని తీవ్రతను సర్దుబాటు చేయడం, ఎప్పుడైనా నిలిపివేయడం ఈ వ్యవస్థ ప్రత్యేకతలుగా సంస్థ పేర్కొంటున్నది. మారుమూల పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే సమయాన్ని పెంచడం, కీలక మౌలిక సదుపాయాల వద్ద వెలుతురు కల్పించి రక్షణ కార్యకలాపాలకు తోడ్పడటం, బహిరంగ ప్రదేశాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రత్యేక అనుభూతిని అందించడం వంటి ప్రయోజనాలు దీని వల్ల కలుగుతాయని సంస్థ చెబుతున్నది.

**స్కైరూట్ ద్వారా ఉపగ్రహాల ప్రయోగం**

ఈ ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్‌తో రెండు ఉపగ్రహ ప్రయోగాల కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్టు రిఫ్లెక్ట్ ఆర్బిటాల్ వెల్లడించింది. ఈ ప్రయోగాలు స్కైరూట్ రూపొందించిన విక్రమ్ రాకెట్ల ద్వారా జరుగుతాయి. 'అంతరిక్ష సాంకేతికతతో భూమిపై కొత్త అవకాశాలను సృష్టించే వినూత్న ప్రయత్నాల్లో ముందున్న రిఫ్లెక్ట్ ఆర్బిటాల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు సూర్యకాంతిని అందించాలన్న వారి ఆలోచనను స్కైరూట్ రాకెట్ల ద్వారా సాకారం చేసేందుకు ఎదురుచూస్తున్నాం' అని స్కైరూట్ ఏరోస్పేస్ సీఈవో పవన్ చందన పేర్కొన్నారు.

# జెన్‌జీ నిరసనలతో ఒత్తిడిలో మోదీ సర్కార్!

**-రానున్న రోజుల్లో యువత నుంచి మరింత అసమ్మతి**

**-ఏసీఎల్ఈడీ ప్రాజెక్ట్ అధ్యయనంలో వెల్లడి**



**న్యూఢిల్లీ, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
వారిని అడ్డుకోవడానికి 10,000 మందికిపైగా భద్రతా సిబ్బందిని మోహరించినప్పటికీ గత వారం దేశంలోని యువ నిరసనకారులు బారికేడ్లను దాటి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ తమను అడ్డుకోవడానికి ప్రయత్నించిన పోలీసు అధికారులతో ఘర్షణ పడ్డారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై అసమ్మతి పెరుగుతుండటం, జెన్‌జీ(యువత) వీధుల్లోకి పోటెత్తుతుండటంతో ఈ ఏడాది దేశంలో వీధి నిరసనలు గత దశాబ్దంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని స్వతంత్ర సంస్థ ఆర్మ్‌డ్ కాన్ఫ్లిక్ట్ లొకేషన్ అండ్ ఈవెంట్ డాటా(ఏసీఎల్ఈడీ) ప్రాజెక్ట్ పేర్కొంది. యువత చేపట్టిన నిరసనలు, ప్రతిపక్షానికి పెరుగుతున్న మద్దతు ఇవి 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సంక్షోభమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.దేశంలోని 100 కోట్ల మంది ఓటర్లలో 30 ఏండ్ల లోపు వయస్సు గలవారు దాదాపు నాలుగో వంతు ఉన్నారు. అయినప్పటికీ ఆయన ప్రభుత్వం ప్రస్తుతం స్థిరంగానే ఉంది. తదుపరి సాధారణ ఎన్నికలు 2029 వరకు జరిగే అవసరం లేదు. దేశం అకస్మాత్తుగా తన గళాన్ని కనుగొన్నది అని సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ అన్నారు. ఇది మోదీ పాలన అంతానికి ఆరంభమని నేను అనను. కానీ ఇది కచ్చితంగా పతనానికి నాంది అని ఆయన పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌పై రాజధాని ఢిల్లీ, ఇతర ప్రాంతాలలో నిరసనలు కేంద్రీకృతమయ్యాయి.

**భయపడని యువత**

మోదీకి బలమైన నాయకుడనే ముద్ర ఉంది. అంతేగాకుండా ఆయన ప్రభుత్వం గతంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే వర్గాలపై కఠినంగా వ్యవహరించింది. దీనికి వీధుల్లో ఉన్న యువత ఏమాత్రం చలించడం లేదు. మోదీ శకంలో దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించిన మొట్టమొదటి యువజన ఉద్యమం కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావంతో ఈ నిరసనలు ఊపందుకున్నాయి.

## ఇండియా కూటమి నిరసనల్లోకి విజయ్ పార్టీ!

-జాతీయ స్థాయి ఆందోళనల్లో టీవీకే పాల్గొంటుంది
-వెల్లడించిన వీసీకే నేత తోల్ తిరుమావళవన్



చెన్నై:
ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పార్టీలు చేపడుతున్న నిరసనల్లో తమిళనాడుకు చెందిన విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) కూడా పాల్గొననుంది. ఈ విషయాన్ని వీసీకే నేత తోల్ తిరుమావళవన్ శుక్రవారం వెల్లడించారు. త్వరలోనే జాతీయ స్థాయిలో జరిగే ఆందోళనల్లో టీవీకే భాగస్వామ్యం అవుతుందని తెలిపారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)తో పాటు ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై టీవీకే ఇప్పటికే వ్యతిరేకత వ్యక్తం చేసింది. అయితే, జాతీయ స్థాయిలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనల్లో ఇప్పటివరకు పాల్గొనలేదు. ఇటీవల తమిళనాడులో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనల్లో మాత్రం టీవీకే పాల్గొన్నట్లు తిరుమావళవన్ వివరించారు. టీవీకే ఇప్పటికే ఇండియా కూటమిలో చేరిందని, ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూటమి చేపడుతున్న ఉద్యమాల్లో ఆ పార్టీ భాగస్వామ్యం అవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి నిరసనల తర్వాత త్వరలో జాతీయ స్థాయి ఆందోళనల్లోనూ పాల్గొంటుందని చెప్పారు.
తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే కూటమిలో కాంగ్రెస్ కీలక భాగస్వామిగా ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌తో కలిసి ఇండియా కూటమి చేపడుతున్న నిరసనల్లో టీవీకే పాల్గొననున్నట్లు తిరుమావళవన్ ప్రకటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే, జాతీయ స్థాయి ఆందోళనల్లో టీవీకే పాల్గొనే తేదీ, కార్యక్రమాల వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన!

మొదటి తరువాయి

రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఆయా ప్రాంతాల ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. నేటి నుంచే వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్న అంచనాలతో ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న వారికి వర్షాలు ఉపశమనం కలిగించే అవకాశముంది. వర్షాల ప్రభావంతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడవచ్చని అంచనా వేస్తున్నారు.

## టెస్లా ఎగిరే కారు!

టెక్సాస్
మొదటి తరువాయి
కార్ల తయారీలో సరికొత్త మార్పులకు టెస్లా శ్రీకారం చుడుతున్నది. సూపర్‌కార్లకు పోటీ ఇచ్చే పనితీరుతోపాటు రాకెట్ సాంకేతికతను పోలిన అధునాతన ఫీచర్లను అందిస్తామని కంపెనీ హామీ ఇస్తున్నది. టెక్సాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రెండోతరం రోడ్‌స్టర్‌ను ప్రదర్శించారు.గాలిలో బారెల్ రోల్(చుట్టూ తిరిగే విన్యాసం) చేయడం, ఒక భారీ సెమీ ట్రక్కును దూకి దాటడం వంటి అద్భుతమైన విన్యాసాలను చూపించారు. ఈ కారు గంటకు 100 కి.మీ. వేగాన్ని కేవలం 0.81 సెకన్లలో అందుకోగలదని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. కొత్త రోడ్‌స్టర్ 2028లో విడుదల కానున్నది.

## నామినేషన్ల తొలిరోజే రణరంగం

మొదటి తరువాయి

పుంగనూరులో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపినట్లు సమాచారం. తిరుపతిలోనూ నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి వ్యవహారశైలిని నిరసిస్తూ టీడీపీ నాయకులు ఆందోళనకు దిగినట్లు కథనాలు వెల్లడించాయి. రిటర్నింగ్ అధికారిని ఆయన బెదిరించారని టీడీపీ నాయకులు ఆరోపించగా, ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఎంపీ వెంట వచ్చిన అనుచరులు రాళ్లదాడికి పాల్పడ్డారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఈ ఘటనలో పుంగనూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు మధు రాయల్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు గాయపడినట్లు తెలిపాయి. మధు రాయల్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.మరోవైపు, నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న మిథున్‌రెడ్డి వాహనాలపై టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వారని వైసీపీ వర్గాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలపై ఇరుపక్షాల మధ్య పరస్పర విమర్శలు కొనసాగాయి. ఘర్షణ తీవ్రం కావడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు.రాయచోటిలోని ఎస్ఎస్ కాలనీలోనూ టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఇరువర్గాల కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడులకు దిగినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో సుమారు 15 కార్లు ధ్వంసమయ్యాయని, నాలుగు కార్లకు నిప్పు పెట్టడంతో అవి దగ్ధమయ్యాయని సమాచారం. వైసీపీ కార్యాలయం సమీపంలో నిలిపిన వాహనాలు కూడా అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
తిరుపతిలోనూ నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి వ్యవహారశైలిపై కూటమి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో వరుస ఘటనలు చోటుచేసుకోవడంతో ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘానికి వైసీపీ ఫిర్యాదు: పుంగనూరు, రాయచోటిలో జరిగిన ఘటనలు, నామినేషన్ల అడ్డగింతపై వైసీపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ నేతలు రాష్ట్ర ఎన్నికల నోడల్ అధికారిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. అధికార పార్టీ వర్గాలు తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపిస్తూ, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో దాడులు, అడ్డగింపులు జరుగుతున్నాయంటూ వైసీపీ హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు కథనం పేర్కొంది. ఘటనలపై పోలీసుల అధికారిక వివరాలు, దర్యాప్తు పురోగతి తెలియాల్సి ఉంది.

## ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది..

మొదటి తరువాయి

నిర్వహించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అన్నారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తేనే స్వేచ్ఛాయుత వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. వైసీపీ వర్గాల కథనం ప్రకారం.. పుంగనూరులో మిథున్‌రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని, ఎంపీ భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయని వైసీపీ వర్గాలు ఆరోపించాయి. అనంతరం అధికారులు మిథున్‌రెడ్డిని నామినేషన్ కేంద్రంలోని ప్రత్యేక గదికి తరలించినట్లు తెలిపాయి. ఘటన సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని కూడా వైసీపీ ఆరోపించింది. ఈ ఘటనపై జగన్ మిథున్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అయితే, దాడికి సంబంధించిన ఆరోపణలపై పోలీసుల అధికారిక ప్రకటన, ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## స్థానిక సమరానికి టీడీపీ సై

మొదటి తరువాయి

కూటమి పాలనతోపాటు స్థానిక సంస్థల్లోనూ తమ పార్టీ కూటమి ప్రాతినిధ్యం ఉంటే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయవచ్చన్నది టీడీపీ నాయకత్వం అభిప్రాయంగా ఉంది. ఈ లక్ష్యంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై రానున్న రోజుల్లో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఢిల్లీలో మళ్లీ టెన్షన్

-'లెహ్రా దో తిరంగా' ఆందోళనను అడ్డుకున్న పోలీసులు
-సీజేపీ నేత అభిజీత్ దీప్, ఏఐఎస్ఏ చీఫ్ నేహా బోరా నిర్బంధం
-150 మందికిపైగా ఆందోళనకారుల అదుపులోకి
-సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు
-నేతల అరెస్టులకు నిరసనగా కదం తొక్కిన సంఘాలు
-కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ చుట్టూ భారీ బందోబస్తు
-టియర్ గ్యాస్, వజ్ర వాహనాలతో పోలీసుల అప్రమత్తత
-'నేను ఏ చట్టాన్ని ఉల్లంఘించాను?' అని దీప్ ప్రశ్న



న్యూఢిల్లీ
దేశ రాజధానిలో తిరంగా నిరసనలతో ఉద్రిక్తత నెలకొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా, తమ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా అరెస్టులకు నిరసనగా కాంగ్రెస్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'లెహ్రా దో తిరంగా' ఆందోళనను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. నిరసనల్లో పాల్గొనేందుకు బయలుదేరిన సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను శుక్రవారం ముందస్తుగా నిర్బంధించారు. మరోవైపు కన్నాట్ ప్లేస్, మండి హౌస్ ప్రాంతాల్లో ఆందోళనలకు దిగిన వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు 150 మందికిపైగా నిరసనకారులను నిర్బంధించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. కరోల్‌బాగ్‌లోని తాను బస చేసిన ప్రాంతం నుంచి కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు వెళ్లేందుకు సిద్ధమైన అభిజీత్ దీప్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అంతకుముందు జండేవాలన్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నోటీసు అందజేశారు. పౌరులు, వ్యాపారులు, ప్రయాణికులు, రోగుల హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని అందులో హెచ్చరించినట్లు సమాచారం. దీప్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో అక్కడ గుమిగూడిన ప్రజలు, కెమెరా సిబ్బంది, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసు వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఆయనను జాఫర్‌పూర్ కలాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు మండి హౌస్‌కు వెళ్తున్న ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్‌కు చేరుకున్న నిరసనకారులను అక్కడి నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను అడ్డుకోవడంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడటమే తమ లక్ష్యమని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నారు. నిరసనల నేపథ్యంలో కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ చుట్టూ పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఇనుప కంచెలు ఏర్పాటు చేసి, వాటి వెంట సిబ్బందిని మోహరించారు. పార్కు వెలుపల టియర్ గ్యాస్ వాహనం, వజ్ర వాహనాన్ని సిద్ధంగా ఉంచగా, లోపల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను నియమించారు. కన్నాట్ ప్లేస్ లోపలి, బయటి వలయాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బందిని మోహరించారు. భారీ బందోబస్తు మధ్య సీజేపీ, విద్యార్థి సంఘాల కార్యకర్తలు సహా పలువురు నిరసనకారులు కన్నాట్ ప్లేస్, మండి హౌస్ ప్రాంతాల్లో ఫ్లాష్ నిరసనలు చేపట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు వేరుగా తిరంగా నిరసనలు నిర్వహించగా, సీపీఎం ఎంపీలు, యువజన సంఘాల ప్రతినిధులతో కలిసి జాన్ బ్రిటాస్ కూడా కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. ఇదిలా ఉండగా, తనను ముందస్తుగా నిర్బంధించడంపై అభిజీత్ దీప్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "నేను న్యూఢిల్లీకి వెళ్లలేకపోవచ్చు.. మరెక్కడికైనా వెళ్లొచ్చు కదా? నేను ఏ చట్టాన్ని ఉల్లంఘించాను?" అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారంటూ పోలీసులు నోటీసులో పేర్కొన్నారని ఆయన తెలిపారు. ఆ ఆరోపణలు హాస్యాస్పదమని పేర్కొంటూ, హింసను ప్రేరేపించేలా ఉన్న ఒక్క వీడియోనైనా చూపించాలని పోలీసులను సవాల్ చేశారు. తిరంగా నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేయగా, వివిధ సంఘాల ఆందోళనలతో రాజధానిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# డీలిమిటేషన్ బిల్లుకు మళ్లీ కసరత్తు!

-ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే యోచన
-కేంద్ర వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు
-2029 ఎన్నికలకు ముందే కీలక బిల్లులకు ఆమోదం పొందాలని ప్రయత్నం
-నియోజకవర్గాల పునర్విభజనతోపాటు మహిళా బిల్లుపైనా దృష్టి
-రాజకీయ సమీకరణాల్లో మార్పులతో మద్దతు కూడగట్టే వ్యూహం
-డీఎంకే, ఎన్సీపీ (ఎస్పీ)తో సంప్రదింపులపై ప్రచారం
-రాజ్యాంగ సవరణ బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి
-లోక్‌సభ, రాజ్యసభల్లో సంఖ్యాబలం సవాలుగా మారే అవకాశం



హైదరాబాద్,
నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును మరోసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, డీలిమిటేషన్‌తోపాటు మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూడా ఆమోదం పొందాలని ఎన్డీయే ప్రభుత్వం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే కీలక బిల్లులపై ముందడుగు వేయాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రత్యేక సమావేశాల నిర్వహణపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. గత ఏప్రిల్‌లో లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లు వీగిపోయిన నేపథ్యంలో, తాజా రాజకీయ పరిణామాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని ఎన్డీయే ప్రయత్నిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో మారిన రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలు బిల్లుకు మద్దతు కూడగట్టేందుకు ఉపయోగపడతాయని కేంద్రం ఆశిస్తున్నట్లు సమాచారం. గతంలో బిల్లును వ్యతిరేకించిన పార్టీల వైఖరిలో మార్పు వస్తుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

మద్దతు కూడగట్టే ప్రయత్నాలు

డీలిమిటేషన్ బిల్లును గతంలో వ్యతిరేకించిన తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే పార్టీల ఎంపీల మద్దతు కీలకంగా మారనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో డీఎంకేతో సంప్రదింపులకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి. రాజ్యసభలో ఎనిమిది మంది సభ్యుల బలం ఉన్న ఎన్సీపీ (ఎస్పీ)తోనూ చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ సంప్రదింపులపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. గత ఏప్రిల్‌లో బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పుడు టీఎంసీ, డీఎంకే సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేసినట్లు కథనాలు గుర్తుచేస్తున్నాయి. అప్పటితో పోలిస్తే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మార్పులు రావడంతో, బిల్లుకు అవసరమైన మద్దతును సమీకరించగలమనే ధీమాతో ఎన్డీయే ఉన్నట్లు సమాచారం.

ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి

డీలిమిటేషన్ ప్రక్రియకు రాజ్యాంగ సవరణలు అవసరమైతే, సంబంధిత బిల్లుల ఆమోదానికి పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి. సభలో మొత్తం సభ్యులలో సగానికి పైగా హాజరై ఉండటంతోపాటు, హాజరై ఓటు వేసిన వారిలో కనీసం మూడింట రెండొంతుల మంది బిల్లుకు మద్దతు తెలపాలి. ఈ నిబంధనల నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభల్లో అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించడం కేంద్రానికి కీలక సవాలుగా మారనుంది. కథనాల ప్రకారం, లోక్‌సభలో ఎన్డీయేకు మద్దతు ఇస్తున్న సభ్యుల సంఖ్య 319గా, రాజ్యసభలో 151గా ఉంది. అయితే ఈ సంఖ్యలతోనే బిల్లులు ఆమోదం పొందుతాయని చెప్పలేం. సభకు హాజరయ్యే సభ్యుల సంఖ్య, ఓటింగ్ సమయంలో పార్టీల వైఖరి వంటి అంశాలు కీలకంగా మారతాయి. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, 'ఒక దేశం--ఒక ఎన్నిక' ప్రతిపాదనలపై కేంద్రం తదుపరి అడుగులు ఎలా ఉండబోతున్నాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

## ప్రభుత్వాన్ని కూల్చేందుకే ఆందోళనలు.

లక్నో



దేశంలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచి, బంగ్లాదేశ్ తరహా పరిణామాలకు దారితీయాలనే లక్ష్యంతో ఇండియా కూటమి ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీసే ప్రయత్నాలను సహించలేమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతిపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని ఇండియా కూటమి పార్టీలు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో రాజ్‌నాథ్‌సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న పరిణామాలను ఉదాహరణగా తీసుకుని భారత్‌లోనూ ప్రభుత్వాన్ని మార్చాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నాయని విమర్శించారు. దేశ యువతను రాజకీయ ప్రయోజనాల కోసం పావులుగా వాడుకుంటున్నారని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచడం, రాజ్యాంగ సంస్థలపై ప్రజల్లో విశ్వాసాన్ని దెబ్బతీయడం, దేశ అభివృద్ధికి ఆటంకం కలిగించడం ప్రజాస్వామ్య హక్కుల పరిధిలోకి రావని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆయనకు మద్దతిస్తున్నవారు గుర్తించాలని వ్యాఖ్యానించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు చట్టాన్ని గౌరవించడం అవసరమని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను బలిచేయకూడదని రక్షణ మంత్రి అన్నారు. ఈ అంశంలో సుప్రీంకోర్టు ప్రస్తావించిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ గత పాలనను ప్రస్తావిస్తూ రాజ్‌నాథ్‌సింగ్ విమర్శలు చేశారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దేశ చరిత్రలో క్షమించరాని తప్పిదమని పేర్కొన్నారు. 1984లో జరిగిన అల్లర్లకు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. 1990లో తన ప్రభుత్వాన్ని కాపాడుకునే క్రమంలో రామభక్తులు, కరసేవకులపై కాల్పులు జరిగాయని ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలతో ప్రతిపక్షాలు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య రాజకీయ విమర్శలు మరోసారి తెరపైకి వచ్చాయి.

## సిరీస్ దక్కేదెవరికో?

-2--2తో సమంగా నిలిచిన ఇరు జట్లు
-నేడు బెంగళూరులో నిర్ణయాత్మక ఐదో టీ20
-చివరి పోరులో గెలిచిన జట్టుకే సిరీస్
-ఫామ్‌లో షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్
-భారత జట్టును వేధిస్తున్న బౌలింగ్ వైఫల్యం
-నిలకడైన బ్యాటింగ్‌పై టీమిండియా ఆశలు
-ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజు శాంసన్‌పైనే భారం
-విజయమే లక్ష్యంగా బరిలోకి విండీస్




బెంగళూరు: భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య టీ20 సిరీస్ పోరు తుది అంకానికి చేరింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు 2--2తో సమంగా ఉండటంతో శనివారం జరిగే చివరి మ్యాచ్ కీలకంగా మారింది. ఈ పోరులో గెలిచిన జట్టుకే సిరీస్ దక్కనుంది. గత మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన వెస్టిండీస్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతుండగా, బౌలింగ్ వైఫల్యాలను అధిగమించి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది.
భారత బ్యాటింగ్‌లోనూ నిలకడ లోపించడం ఆందోళన కలిగిస్తోంది. ఒక మ్యాచ్‌లో రాణించిన ఆటగాళ్లు మరో మ్యాచ్‌లో అదే స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజు శాంసన్ శుభారంభం అందించడం కీలకం కానుంది. వీరిలో ఎవరో ఒకరు క్రీజులో నిలదొక్కుకున్నా జట్టు భారీ స్కోరు సాధించే అవకాశాలు మెరుగుపడతాయి. ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా బ్యాట్‌తో రాణించాల్సిన అవసరం ఉంది. తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డిలపై కూడా జట్టు ఆశలు పెట్టుకుంది.
భారత్‌కు ప్రధాన సమస్యగా బౌలింగ్ మారింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతో ప్రత్యర్థి బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. కీలకమైన చివరి పోరులో పరుగులను కట్టడి చేయడంతోపాటు వికెట్లు తీయడంపై భారత బౌలర్లు దృష్టి పెట్టాల్సి ఉంది. ఫీల్డింగ్‌లోనూ మెరుగైన ప్రదర్శన అవసరం. మరోవైపు, గత మ్యాచ్‌లో విజయంతో జోరుమీదున్న వెస్టిండీస్ సిరీస్‌ను చేజిక్కించుకోవాలని చూస్తోంది. కెప్టెన్ షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్ ఫామ్ జట్టుకు సానుకూలాంశంగా మారింది. వీరు మరోసారి రాణిస్తే భారత్‌కు సవాల్ తప్పదు. దీంతో ఇరు జట్ల మధ్య చివరి టీ20 ఉత్కంఠభరితంగా సాగనుంది.

# సంపాదకీయం

## సింగరేణి పాలిట రాకాసి కాంగ్రెస్!



**తెలంగాణలో ఉమ్మడి నాలుగు జిల్లాలలో సింగరేణి గోదావరికి పరివాహక ప్రాంతంలో ఏర్పడి ఉంటుంది. సింగరేణి ఉత్పత్తిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 49శాతంగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 58 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం 40 ఏండ్లు, తెలుగుదేశం పార్టీ 17న ఏండ్లు పాలించాయి. కానీ సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు. సింగరేణి కార్మికుల కష్టాలను మానవీయ కోణంలో చూస్తేనే అర్థమవుతాయి. కీలకమైన సంస్థలో కార్మికుల పట్ల, వారికి అవసరమైన చట్టాలు, హక్కుల పట్ల పాలకులు విఫలమయ్యారు. కానీ ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల గోస తీర్చింది. కానీ మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పాత కష్టాలు తిరిగి మొదలయ్యాయి.**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యవేక్షణలో సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించింది. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కేసీఆర్ అండగా నిలిచారు. కారుణ్య నియామకాలు కల్పించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే కొన్ని పార్టీల వారు ముఠాలుగా ఏర్పడి, సుమారు 17 కోర్టు కేసులు వేశారు. కేసీఆర్ న్యాయ నిపుణులను సంప్రదించి స్వతంత్ర సంస్థ అయిన సింగరేణిలో కారుణ్య నియామకాలకు మార్గం సుగమం చేశారు. తొమ్మిదిన్నరేండ్లలో 20 వేల కారుణ్య వరకు నియామకాలు చేపట్టారు. అలాగే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా సింగరేణి కార్మికుల కుటుంబాలకు చెందిన 4,000 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. సింగరేణిని లాభాల బాట పట్టించడంలో కీలక పాత్ర పోషించే ఉద్యోగులు, కార్మికులకు లాభాల్లో వాటా విషయంలో సమైక్య రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయి. కేవలం 12 శాతం లాభాల పాట పంపిణీ చేశాయి. కేసీఆర్ సర్కార్ మాత్రం 20 శాతానికి పెంచింది. ఆ మొత్తాన్ని 2023 వరకు 32 శాతానికి తీసుకెళ్లింది. సింగరేణి కంపెనీ లాభాలు రూ.6,323 కోట్లు వస్తే రూ.2,360 కోట్లుగా చూపించి మిగతా ప్రాఫిట్‌ను సింగరేణి అభివృద్ధి పేరిట ఖర్చు చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో అసలే కుంభకోణాల్లో కూరుకుపోయిన సింగరేణిలో ఉత్పత్తి తగ్గింది. లాభాలు రాలేని దుస్థితి నెలకొన్నది. సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరిట అనుభవం ఉన్న కాంట్రాక్టర్లకు కాంగ్రెస్ పాలకులు పొగబెడుతున్నారు. బంధుమిత్రులకు టెండర్లు అప్పగిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమ్మర్ది సృజన్‌రెడ్డికి చెందిన సోదా కన్‌స్ట్రక్షన్స్ కూడా ఉన్నదని తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ అధికారంలో సమయంలో ఓపెన్ టెండర్ల విధానం నిర్వహించారు. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూపాలపల్లిలో ఒక్క ఓబీ టెండర్‌కు పిలిచి, ఇప్పుడు ఎవరికి లబ్ధి చేకూర్చడం కోసం సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తీసుకొస్తున్నారు? సింగరేణి కార్మికుల సంఖ్య 40,000 లో 20 వేల కార్మికులు బీఆర్ఎస్ హయాంలో కారుణ్య నియామకాలతో విధుల్లో చేరినవారే. గతంలో సింగరేణి కార్మికుల పిల్లలకు మాత్రమే మెడికల్ ఇన్వాల్యుయేషన్ ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణి కార్మికుల తల్లిదండ్రులకు కూడా పూర్తిస్థాయి నాణ్యమైన వైద్య సాయం అందించారు. ఇప్పుడు సింగరేణి కార్మికులు పెద్ద దవాఖానలకు పోతే వైద్యం చేసేందుకు నిరాకరిస్తున్నారు. సింగరేణి కార్మికుల నుంచి తీసుకునే ప్రొఫెషనల్ టాక్స్‌ను కేసీఆర్ హయాంలో రద్దు చేశారు. అలాగే ఆదాయపన్నును కూడా రద్దు చేసే దిశగా అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటుకు పంపించారు. ఈ విషయాన్ని కార్మిక లోకం గుర్తుంచుకోవాలి. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు, అవినీతి టెండర్‌ల ప్రక్రియ గురించి ఎందుకు సీరియస్‌గా స్పందించడంలేదు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరిపించాలి. అదేవిధంగా కార్మికుల చెమటోడ్చి సింగరేణికి ఆర్జించి పెట్టిన నిధుల నుంచి రూ.100 కోట్లను మెస్సితో ఫుట్‌బాల్ ఆడడానికి దుబారా చేసిన ఘనత రేవంత్‌రెడ్డిది. సింగరేణిలో అడుగడుగునా కుంభకోణాలు, అక్రమాలకు పాల్పడుతూ అందిన కాడికి దోచుకుంటూ సీఎం అంటే ప్రజల చీఫ్ మినిస్టర్‌గా కాకుండా కోల్ మాఫియా అవతారం ఎత్తారు. మరోవైపు ప్రైవేటీకరణకు కూడా కాంగ్రెస్ పాలకులు మంతనాలు నడుస్తున్నాయని చర్చ జరుగుతున్నది. ఇందుకు పెద్దల సమక్షంలోనే డైరెక్షన్స్ అందుతున్నాయని తెలుస్తున్నది. అలాంటి ప్రయత్నాన్ని ప్రభుత్వాలు రద్దు చేసుకోకపోతే ఎన్నో పోరాటాల చరిత్ర గలిగిన సింగరేణి కార్మికులు మరొక ఉద్యమానికి సిద్ధమవుతారు. బొగ్గు కుంభకోణాల్లో కూరుకుపోయిన కాంగ్రెస్ పతనం ఖాయమని కార్మిక లోకం హెచ్చరిస్తున్నది.

# ఎల్‌నినోలో విద్యుత్ సమస్యను ఎదుర్కోవడం ఎలా?



తెలంగాణ విద్యుత్ రంగం ఒక కీలకమైన మలుపు వద్ద నిలబడింది. ఒకప్పుడు వేసవిలో మాత్రమే విద్యుత్ డిమాండ్, వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుతుందనే భావనను ప్రస్తుతం తలక్రిందులు చేస్తున్నది. ఈ వర్షాకాలం సెప్టెంబర్ నెల ముగిసే సమయానికి రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 20,000 మెగావాట్లకు చేరువైంది. ఎన్‌నినో ప్రభావం వలన ఏర్పడిన అనూహ్య పరిణామామిది. సెప్టెంబర్ చివరి రోజుల్లో 19,000 మెగావాట్లు దాటిన డిమాండ్ అక్టోబర్ 1న 19,892 మెగావాట్లకు చేరుకోవడం భవిష్యత్తులో ఏర్పడబోయే పరిస్థితులకు ఒక హెచ్చరిక. వాతావరణ మార్పులు, వర్షాభావం, వ్యవసాయ బోర్ల వాడకం, లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్, పట్టణీకరణ, పరిశ్రమలు, ఉక్కపోత కారణంగా పెరిగిపోయిన కూలింగ్ వ్యవస్థల వినియోగం, డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు తదితరాలన్నీ కలిపి తెలంగాణ విద్యుత్తు వ్యవస్థను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల సాధారణ పరిస్థితుల్లో తగ్గిపోవాల్సిన వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. భూగర్భజలమట్టాలు పడిపోవడం వలన బోర్లను ఎక్కువసేపు నడపడంతో విద్యుత్ వినియోగం, డిమాండ్ భారీగా పెరిగిపోయింది. ఇదే సమయంలో భారీ ఎత్తిపోతల పథకాలు విద్యుత్ వినియోగం వలన డిమాండ్ అసాంతం పెరిగిపోయింది. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే కొద్దీ లిఫ్ట్ వినియోగం మరింతగా పెరగవచ్చు. ఇప్పటికే డిమాండ్ 20వేల మెగావాట్లకు చేరుకున్నదంటే రాబోయే యాసంగి కాలానికి 25,000 మెగావాట్ల డిమాండును దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బహిరంగ మార్కెట్లో ఖరీదైన విద్యుత్తును కొనడం కాకుండా భవిష్యత్తు అవసరాలకు సరిపడా ఉత్పత్తి, సరఫరా, నిల్వ సామర్థ్యం, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న డిమాండును తీర్చడానికి కేవలం పగటిపూట అందుబాటులో ఉండే సోలార్, నీటి లభ్యత మీద ఆధారపడే జలవిద్యుత్‌లపై ఆధారపడకుండా బేస్‌లోడ్‌గా పరిగణించబడే థర్మల్ విద్యుత్ కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైన బొగ్గు నిల్వలు, అత్యవసర పరికరాలను సంసిద్ధం చేసుకోవాల్సిన అవసరముంది. నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడానికి సింగరేణి సంసిద్ధంగా లేని ప్రస్తుత పరిస్థితుల్లో కోల్ ఇండియా, మహానది కోల్ ఫీల్డ్, నైనీ బొగ్గు గనిలాంటి వివిధ మార్గాల ద్వారా తెలంగాణ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన 30-40 మిలియన్ టన్నుల బొగ్గు అవసరాలకు యుద్ధప్రాతిపదికన ఉపక్రమించాలి. థర్మల్ కేంద్రాలను పీక్ డిమాండును తట్టుకోవడానికి, గ్రిడ్ బ్యాలెన్సింగ్ చేయడానికి నేర్పుగా ఉపయోగించుకోవాల్సిన సందర్భం. హైదరాబాద్ మహానగరం, పారిశ్రామిక కారిడార్లు, కొత్త డేటా సెంటర్ల కోసం ట్రాన్స్‌మిషన్ ప్లానింగ్ అవసరం. ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న 400 కెవి, 220 కెవి, 132 కెవి ఇహెచ్‌టి సబ్-స్టేషన్లను గుర్తించి డిమాండును తట్టుకునే ప్రత్యామ్నాయ మార్గాలను యుద్ధప్రాతిపదికన ఎంచుకోవాలి. అవసరమైన చోట హెచ్‌టియల్‌యస్ కండక్టర్ వాడడం ద్వారా ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. డిమాండు హెచ్చరికలు ఉన్న చోట అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలి. పంపిణీ వ్యవస్థలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కెవి, 11 కెవి ఫీడర్లు, 33/11 కెవి సబ్- స్టేషన్లు, ఎక్కడెక్కడ ఓవర్‌లోడ్ అవుతున్నాయో గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, ఫీడర్ల విభజన, నూతన సబ్-స్టేషన్లు, లైన్ల నిర్మాణం చేపట్టి పంపిణీ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముంది. గ్రామీణ ప్రాంతాల్లోని సబ్-స్టేషన్లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మెరుగైన ఓల్టేజీతో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి వీలుంటుంది. గ్రామాల వారీగా రైతులతో ముఖాముఖి సమావేశాలను ఏర్పాటు చేసి నీటి, విద్యుత్ యాజమాన్య పద్ధతులతో చైతన్యపరచాలి. రాబోవు కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి రాష్ట్రస్థాయి నుండి మండలస్థాయి వరకు నోడల్ టీంలను ఏర్పాటు చేయాలి. విద్యుత్తు, మండల అభివృద్ధి, రెవెన్యూ, పంచాయత్రాజ్, ఇరిగేషన్, మంచినీటి సరఫరా, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఇందులో చేర్చి గ్రామాల వారీగా పర్యటించి రైతులను, ప్రజలను చైతన్యపరచాలి. ఎక్కువ నీటిని తోడివేసే వరిపంటలకు బదులుగా పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, జొన్న, తృణధాన్యాలు, వేరుశెనగ లాంటి ఆరుతడి పంటల దిశగా రైతులను మళ్ళించాలి. పశువులకు అవసరమైన గడ్డి విత్తనాలను, పంట విత్తనాలను, ఎరువులు, పురుగు మందులు, రైతులకు ఉచితంగా అదించాలి. నీటిని సమర్థవంతంగా ఉపయోగించే డ్రిప్, స్ప్రింక్లర్ల లాంటి పరికరాలను సీలింగ్ లేకుండా రైతులకు నామమాత్రపు ధరలకు అందుబాటులో ఉంచాలి. రైతు పంటలకు బీమా సౌకర్యం కల్పించడమే కాకుండా అవసరమైన మేరకు పంట నష్టపరిహారం చెల్లించాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ఈ సందర్భంగా అత్యంత ఆవశ్యకం. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్తు పొదుపు, ఫైవ్‌స్టార్ రేటింగ్ పరికరముల వాడకం, కూలింగ్ వ్యవస్థలను పొదుపుగా వాడకం గురించి ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపట్టాలి. కరెంటును విలాస వస్తువుగా కాకుండా అత్యవసరమైన వస్తువుగా భావించి పొదుపుగా వాడుకోవాల్సిన గడ్డుకాలంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# భారత్‌లో స్టార్‌లింక్ వివాదం




అమెరికన్ బిలియనీర్ ఎలాన్ మస్క్ వ్యాపార కుటుంబ వ్యాపారాలు ఇప్పటికే అనేక వివాదాలు సృష్టిస్తూ తెలుస్తుండగా, ఇటీవల గూగుల్, రేడియో బెట్టి స్వరూపంలో వివాదం ప్రారంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా వేలాది చిన్న భారత్ దేశానికి దిగుమతి చేసుకునే ఆలోచన ఇన్ని సమస్యలకి నాందిగా మారి వివాదాస్పదమైంది. భారత్‌లో పరిణామాలు అనుగుణంగా ఆఫ్రికా ప్రజలను నేడు వేధిస్తున్నట్లు తెలుస్తోంది. విదేశీ భాగస్వామ్యం స్పష్టతలేదు అంటున్నారు. భారత్‌కు సిగ్నల్స్ ఎలా అందుతాయి? ఇతర దేశాల మస్క్ వర్సెస్ మోదీగా మారుతుందంటారా? ఈ రకమైన వివాదాస్పదంగా దర్శనమిస్తోంది. అయితే, ఈ గొడవలకు కేవలం ఒక శ్రామిక పోటీయే కాకుండా చాలా దేశాల భద్రతా తీవ్రతలు, మిగిలిన భాగస్వామ్య సంబంధంలేని విదేశాలు శాటిలైట్ సేవలు విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మస్క్ సంస్థకు చెందిన డిజిటల్ స్పేస్‌లో మస్క్ యజమానితో ఒక ఒప్పందం కుదుర్చుకోలేదన్న నిరసనగా స్పేస్ ఎక్స్ 'ఫ్రీ వెబ్' సంస్థతో అవసరం లేకుండా, అంతరిక్షంలో ఉన్న వేలాది ఉన్న ఉపగ్రహాల ద్వారా నేరుగా భారత్‌పై ఉన్న టీవీ, గేమింగ్‌ను స్టార్‌లింక్ ప్రసారం చేయగల సామర్థ్యాన్ని కలిగివుండటమే లోక్‌సభలోని వివిధ గ్రూపులు ఆక్షేపిస్తున్నాయి. పరిశ్రమల గ్రామీణులు ఈ ఆందోళనను సొమ్ము చేసుకుందుకు భారత్‌లో ప్రవేశించడమే లక్ష్యంగా గౌతమ్ అదానీ వంటి ప్రముఖులు తప్పుబడుతున్నారు. అయితే నిబంధనలు.. "స్పెక్ట్రమ్ వేలంపాటపై వస్తున్న వార్తలను టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) లేదా, టెలికాం మంత్రిత్వశాఖల ఆధారంగా నివేదికలు వచ్చాయి. అసలు వివాదానికి ప్రధాన కారణం ఏంటంటే సాంకేతిక వర్గాల సమాచారం ప్రకారం ప్రపంచంలోనే అత్యుత్తమ సేవలు అందిస్తామని బిలియనీర్ ప్రశాంతంగా ప్రకటించడమే ముఖ్య వాదన కాగా, రేడియో స్పెక్ట్రమ్ వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని, అప్పుడే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉంటుందని అంబానీ, సునీల్ మిత్తల్‌తో పాటు చెప్తున్నారు. డిజిటల్ టెలికాం రంగాన్ని భద్రత, దేశీయ లోకలైజేషన్ అంశాల ప్రకారం అధికారికంగా కాపాడాలి. టెలికామ్ పరికరాలు లేదా రేడియో తరంగాల్లో భద్రతా అంశాలు, దేశీయ ఏజెన్సీలు లేదా సిగ్నల్ నిఘా వేయడం సులభం చేయాలని ఉపగ్రహ వ్యవస్థలు డిమాండ్ చేస్తున్న అంశాలను కేంద్ర నివేదికలు క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. టెలికాం నిబంధనలన్నీ పాటించాల్సిందేగా, స్పష్టంగా ఉన్నాయని, స్టార్‌లింక్ సాధించే ఇతర సేవలకు నిబంధనల అమలు చేసే ప్రక్రియ మిగిలిన దేశాల్లో ఉన్నట్లుగా కేటాయింపుల సంస్కరణ లపై స్పష్టం చేసింది. ఈ వ్యాపార పోటీ తీవ్ర స్థాయిలో ఉందనే భావిస్తున్నారు. ప్రత్యర్థి లక్ష్మణరేఖ దాటితే ప్రభుత్వ ప్రయోజనాలకి ఆటంకం కలుగుతుందని భయపడుతున్నారు. దేశభక్తి ఈ పరిణామం కాదో.. అని ప్రశ్నించే వారి సంఖ్య నాటి నుండి నేటి వరకు పెరుగుతోందని స్పష్టంగా చెప్పారు. దీంతో మస్క్ తొందరపడాలా, లేక నేరుగా ప్రతిపాదనలు అని అడిగారా? ఇది తెలంగాణ స్పేస్ రీసెర్చ్ ట్రస్ట్ ఈ వివాదాన్ని స్వీకరించి పనిచేస్తోంది అని చెప్పడం గమనార్హం. అయితే ఉమ్మడి వ్యాపారాల ప్రయోజనం ఏంటంటే కాంగ్రెస్ నాయకులు ప్రధాని మోదీని సంప్రదించనందుకు విమర్శించారు. బాధ్యత లేకుంటే ప్రధాని మోదీ, బిలియనీర్ తిలక్‌తో ఎలాంటి సంబంధాలు లేకున్నా మాట్లాడారా, స్పేస్ ఎక్స్, టెస్లా సంస్థల కార్యకలాపాలను విస్తరించడానికి భారత్ పర్యటనకు రాబోతారని వ్యాఖ్యానించారు. నిజానికి భారత్ నిబంధనలను బేఖాతరు చేసే విధంగా కంపెనీ వైఖరి లేదని స్పష్టం చేసినా, భద్రతాపరమైన వివరాలు ఇవ్వడానికి మస్క్ స్పందించలేదు. పిటిషన్ల సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన భారత ప్రభుత్వం ఇతర నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది. మరొకవైపు, ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం చాలా వరకు వ్యాపారాన్ని మార్చేసిందని, కానీ భద్రతాపరంగా ప్రమాదాల నివారణకు ప్రైవేటు సంస్థల కార్యకలాపాలను కట్టడి చేయాలని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు. మస్క్ ప్రవర్తన ఆధారంగా శాటిలైట్ నెట్‌వర్క్‌పై ఆధారపడే రోజుల్లో ఆయన తక్షణమే తన నిర్ణయాలను మార్చుకుంటే భారత్‌కు చాలా సమస్యలు ఎదురవుతాయని భావిస్తున్నారు. కాబట్టి, ఇతర నిబంధనలను విధిస్తూ స్పెక్ట్రమ్ కేటాయింపులపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. స్టార్‌లింక్ భారత తీరాలకు రావడం ద్వారా దేశీయంగా కొన్ని టెలికామ్ కంపెనీలు సవాళ్లను ఎదుర్కొంటాయని, మస్క్ విస్తరణ విధానం వల్ల వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతాయని మరికొందరు వాదిస్తున్నారు. అయితే వ్యాపార పోటీలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతం వేచి చూడాల్సి ఉంది.

## తప్పుడు అఫిడవిట్‌లపై పౌరులు ఫిర్యాదు చేయొచ్చు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16**

ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు తమ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు సమర్పిస్తే దానిపై ప్రజాప్రతినిధుల చట్టం కింద ప్రైవేట్ పౌరులు క్రిమినల్ ఫిర్యాదులు దాఖలు చేయవచ్చునని శుక్రవారం జస్టిస్‌లు దీపాంకర్ దత్తా, షీల్ నాగులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఇటువంటి కేసుల్లో



ఫిర్యాదు దాఖలు చేసేందుకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 195 కింద ఉన్న ఆంక్షలు అడ్డుకావని సుప్రీంకోర్టు పేర్కొంది. సంబంధిత కోర్టు అధికారికంగా లిఖితపూర్వక ఫిర్యాదు దాఖలు చేస్తే తప్ప కొన్ని నిర్దిష్ట క్రిమినల్ నేరాలను క్రిమినల్ కోర్టులు నేరుగా విచారణకు స్వీకరించకుండా ఆ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 195 నిరోధిస్తుంది.

# ఏపీ పోలీసులకు ఊరట..

**- నేడు సాయంత్రంలోగా సరెండర్ లీవ్ నగదు జమ!**

**-పోలీస్ సిబ్బంది ఖాతాల్లోకి నగదు బదిలీకి ప్రభుత్వ నిర్ణయం**

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్: అక్టోబర్ 16,2026.** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. పోలీస్ సిబ్బందికి సంబంధించిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ (సెలవుల నగదీకరణ) నిధులను విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు శుక్రవారం సాయంత్రంలోగా అర్హులైన పోలీస్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానున్నట్లు వెల్లడైంది. చాలా కాలంగా సరెండర్ లీవ్ నగదు కోసం ఎదురుచూస్తున్న పోలీస్ సిబ్బందికి ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. అయితే నగదు జమకు సంబంధించి అధికారిక ప్రకటన, నిధుల బదిలీ స్థితిని సంబంధిత శాఖ ద్వారా నిర్ధారించుకోవాల్సి ఉంది.

# రూ.7.05 లక్షల దోపిడీ కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

**-నలుగురు నిందితుల అరెస్ట్.. రూ.6.53 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**






**నంద్యాల క్రైం, డ్రీమ్ టైమ్స్:** భూమి రిజిస్ట్రేషన్ కోసం నగదుతో వెళ్తున్న మహిళ నుంచి రూ.7.05 లక్షలు దోచుకున్న కేసును కోవెలకుంట్ల పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఈ ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసి, రూ.6.17 లక్షల నగదుతో పాటు రూ.36 వేల విలువైన సెల్‌ఫోన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరుకు చెందిన సాన లక్ష్మీదేవి ఈ నెల 14న తన మరిది, మామతో కలిసి భూమి రిజిస్ట్రేషన్ కోసం కోవెలకుంట్లకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా, గుల్లదుర్తి సమీపంలోని నిర్మాణంలో ఉన్న టోల్‌గేట్ వద్ద దుండగులు వాహనాన్ని అడ్డగించి నగదు బ్యాగును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో లక్ష్మీదేవికి గాయాలయ్యాయి. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించిన పోలీసులు అక్టోబర్ 16న అరెస్టు చేశారు. నిందితుల నుంచి నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, పల్సర్ మోటార్‌సైకిల్, హెల్మెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన సీఐ పి. హనుమంత నాయక్, ఎస్ఐ పి. మల్లికార్జునరెడ్డి సహా పోలీసు సిబ్బందిని అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా అభినందించారు.

# గో సంరక్షణ పథకానికి రూ.లక్ష విరాళం

**-గోసేవకు దాతల చేయూత.. దాతృత్వాన్ని చాటుకున్న భీమవరం వాసి**



**డ్రీమ్ టైమ్స్ । అక్టోబర్ 16, 2026 శ్రీశైలం:** శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి భక్తులు తమ వంతు సహకారం అందిస్తూ గోసేవలో భాగస్వాములవుతున్నారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శ్రీ వి.ఆర్. ఉపేంద్ర శుక్రవారం గో సంరక్షణ పథకానికి రూ.1,00,000 (లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. గో సంరక్షణకు చేయూతనందించాలనే సదుద్దేశంతో ఆయన ఈ విరాళాన్ని సమర్పించారు. దాత అందజేసిన విరాళ మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు డి. మల్లికార్జునుడు స్వీకరించారు. అనంతరం దాతకు తగిన రశీదుతో పాటు దేవస్థానం తరఫున ప్రసాదాలను అందజేశారు. హిందూ సంప్రదాయంలో గోవుకు విశిష్టమైన స్థానం ఉందని, గోసంరక్షణ అనేది ధార్మికంగానే కాకుండా సంప్రదాయ పరిరక్షణలోనూ ఎంతో ప్రాధాన్యత కలిగిన సేవ అని భక్తులు భావిస్తారు. గోవుల సంరక్షణ, పోషణకు తోడ్పడే ఇటువంటి విరాళాలు మరింత మంది దాతలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. శ్రీశైల దేవస్థానం చేపడుతున్న గో సంరక్షణ పథకానికి భక్తులు తమకు తోచిన విధంగా విరాళాలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. దాతృత్వంతో ముందుకొచ్చిన శ్రీ వి.ఆర్. ఉపేంద్ర సేవాభావం గోసంరక్షణకు తోడ్పడటంతో పాటు ఇతర భక్తులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## రాయలసీమ మాల మహానాడు అధ్యక్షునికి పరమర్శ.



**నంద్యాల.(డ్రీమ్ టైమ్స్)** మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు బి మద్దిలేటి త్వరగా కోలుకోవాలని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి ఆకాంక్షలు బుధవారం నాడు బైక్ ఆక్సిడెంట్ లో గాయాలు పాలై నందాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మద్దిలేటిని శుక్రవారం నాడు పరామర్శించారు .ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ మదిలేటి ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షునిగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా మాల్లో ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలని మద్దిలేటి త్వరగా కోలుకోవాలని మరలా తిరిగి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు .ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రాజకుమార్ ,రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు, తదితరు మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు!







**-100 మీటర్ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు..**

**-అభ్యర్థితో పాటు ఇద్దరికే అనుమతి**





**నంద్యాల క్రైమ్ ।డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 16, 2026 .** నంద్యాల:నంద్యాల మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ శ్రీమతి సుస్మిత, ఐపీఎస్ తెలిపారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 52 వార్డులకు సంబంధించి అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి తమ నామినేషన్లను సమర్పించాలని అధికారులు సూచించారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా నామినేషన్ కేంద్రంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా గదుల వివరాలను తెలియజేసే సూచిక బోర్డులను సైతం అందుబాటులో ఉంచారు. దీంతో అభ్యర్థులు తమకు కేటాయించిన గదులను గుర్తించి నామినేషన్ ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకోవచ్చు.భద్రతా చర్యల్లో భాగంగా నామినేషన్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు వ్యక్తులకు మాత్రమే కేంద్రంలోకి ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో నామినేషన్‌కు మొత్తం ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుంది.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పోలీసు శాఖకు సహకరించి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఏఎస్పీ సుస్మిత సూచించారు.

# మూలానక్షత్రం సందర్భంగా కొలనుభారతీ క్షేత్రంలో విశేష పూజలు

**-5 వేల మందికి పైగా భక్తుల అమ్మవారి దర్శనం..**

**-చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు**



**డ్రీమ్ టైమ్స్ । అక్టోబర్ 16, 2026** శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం దత్తత దేవాలయమైన కొలనుభారతీ క్షేత్రంలో మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సరస్వతీ అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాది అర్చనలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 5 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసాలు చేయించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మూలానక్షత్రం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించడంతో పాటు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు నిరంతరంగా మంచినీటి సౌకర్యం కల్పించారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద వితరణ నిర్వహించగా, సుమారు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. ఉదయం 4 గంటలకు ఆలయ ప్రధాన ద్వారాలను తెరిచి మంగళవాయిద్యాల నడుమ ఆలయ కైంకర్యాలను ప్రారంభించారు. ముందుగా సంప్రదాయబద్ధంగా తీర్థబిందె సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు కొలను నుంచి జలాలను తీసుకువచ్చి ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగాలని గణపతి పూజ నిర్వహించారు. సరస్వతీ అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, పుష్పార్చన, బాలభోగ నివేదన, మహామంగళహారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనంతో పాటు సామూహిక అక్షరాభ్యాసాలకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 11.15 గంటలకు అమ్మవారికి మధ్యాహ్న పూజలు, మహానివేదన నిర్వహించిన అనంతరం 11.45 గంటల నుంచి దర్శనాలు కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాల పూజలు, నివేదన, మహామంగళహారతి నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణ కోసం దేవస్థానం అధికారులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించగా, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తూ మూలానక్షత్ర ప్రత్యేక పూజలను విజయవంతంగా నిర్వహించారు.

# శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు








**డ్రీమ్ టైమ్స్ । అక్టోబర్ 16, 2026 శ్రీశైలం** : శ్రీశ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల క్షేత్రమైన శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజూ సాయంత్రం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై వివిధ కళారూపాలను ప్రదర్శించడంతో పాటు, స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవంలో జానపద కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

**నిత్య కళారాధన వేదికపై ఆకట్టుకున్న ప్రదర్శనలు**

సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన శ్రీ నందీశ్వర ఆర్ట్స్ అకాడమీ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శ్రీమతి కె. ప్రమీల భాగవతారిణి పార్వతీ కల్యాణం హరికథను ప్రదర్శించి భక్తులను అలరించారు. అనంతరం రాత్రి 8.30 గంటల నుంచి హైదరాబాద్‌కు చెందిన డా. సోమేశ్వర ప్రసాద్ ఇల్లూరి కూచిపూడి కళాక్షేత్రం వారిచే గిరిజా కల్యాణం నృత్య ప్రదర్శన నిర్వహించారు.



**గ్రామోత్సవంలో అలరించిన జానపద కళారూపాలు**

శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవంలో భక్తులను అలరించేందుకు నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం, విళక్కు, స్వాగత నృత్యం, కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, అశ్వ ప్రదర్శన, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, త్రిశూలం, జేగంట, కంచుడోలు, తాళాలు, చెక్కభజన, అమ్మవారి వేషం, తప్పెట చిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలుకుణిత తదితర సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు. కన్నడ జానపద కార్యక్రమాలు సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతీయ సంప్రదాయ కళలు, జానపద సంస్కృతిని ప్రోత్సహిస్తూ భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక అనుభూతిని అందించేలా శ్రీశైల దేవస్థానం ఈ కార్యక్రమాలను నిర్వహించింది. దసరా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# సరస్వతీ దేవిగా కనకదుర్గమ్మ!..

-ఇంద్రకీలాద్రికి భక్తజన సంద్రం..

-మూలా నక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

-సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

-రద్దీ కారణంగా అన్ని వీఐపీ, సిఫార్సు దర్శనాలు రద్దు

-భక్తుల కోసం ఐదంచెల భద్రతతో పటిష్ఠ ఏర్పాట్లు



**విజయవాడ (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం, అమ్మవారి జన్మనక్షత్రమైన 'మూలా నక్షత్రం' కావడంతో కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ పవిత్రమైన రోజున అమ్మవారు జ్ఞాన ప్రదాయిని అయిన శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు అన్ని రకాల సిఫార్సు దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులందరికీ కేవలం ఉచిత దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. రద్దీని నియంత్రించేందుకు పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మూడు చోట్ల హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి, ఐదంచెల భద్రత నడుమ భక్తులను క్రమపద్ధతిలో క్యూలైన్ల లోకి అనుమతిస్తున్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు సాంకేతికత సాయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేస్తున్నారు. అశ్వయుజ శుద్ధ సప్తమి, మూలా నక్షత్రం రోజున అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో పూజించడం వల్ల విద్య, జ్ఞానం, బుద్ధికుశలత సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. మరోవైపు, శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబికా దేవి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజున కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు

# నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

-అక్టోబర్ 22 వరకు దరఖాస్తులకు అవకాశం



**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
ఒంగోలులోని పి.ఎం. శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--2028 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును అక్టోబర్ 22వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ సి. శివరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
గతంలో అక్టోబర్ 15వ తేదీతో ముగియనున్న దరఖాస్తు గడువును విద్యార్థుల సౌకర్యార్థం మరో వారం రోజుల పాటు పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 8, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షను 2027 ఏప్రిల్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ ఎం. ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ ముఠా అరెస్ట్

- 75 కిలోల కాపర్ వైరు, మోటారు సైకిల్ స్వాధీనం

- నలుగురు నిందితులు అరెస్ట్..

- మరొకరు పరారీ

- చిట్వేలి పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన చోరీల వ్యవహారం



**చిట్వేలి (డ్రీమ్ టైమ్స్), అక్టోబర్ 16:**
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని కాపర్ వైర్లను అపహరిస్తున్న ముఠాను చిట్వేలి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 75 కిలోల కాపర్ వైరు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**రైతుల ఫిర్యాదులతో దర్యాప్తు**
చిట్వేలి మండలంలో గత కొన్ని నెలలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను చోరీ చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పలువురు రైతుల మోటార్ల వద్ద విద్యుత్ వైర్లను సైతం కత్తిరించి తీసుకెళ్తుండటంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చిట్వేలి ఎస్సై వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులపై నిఘా పెట్టారు.

**వాహన తనిఖీల్లో పట్టుబడ్డ నిందితులు**
గురువారం సాయంత్రం నాగవరం గ్రామ శివారులో చిట్వేలి--కోడూరు ప్రధాన రహదారిపై ఎస్సై వినోద్ కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కొందరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ల చోరీకి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.
అరెస్టయిన వారిలో రైల్వేకోడూరు మండలంలోని గంగరాజుపోడు ఎస్టీ కాలనీకి చెందిన పాముల వాసు, నెల్లూరు జిల్లా రాపూరు మండలం సిల్లేపల్లి గ్రామానికి చెందిన మొలకల అశోక్, చిట్వేలి మండలం వీవీ కండ్రిక ఎస్టీ కాలనీకి చెందిన చిక్కోలు మల్లికార్జున, పెద్దూరు ఎస్టీ కాలనీకి చెందిన చిక్కోలు శంకర్ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.
కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, ఎస్సై వినోద్ కుమార్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో 75 కిలోల కాపర్ ను ఒక మోటార్ సైకిల్ ని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడిగా పేర్కొన్న మడిచెరువు చరణ్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**వరుస ఆపరేషన్లతో చిట్వేల్ పోలీస్ స్టేషన్ కు గుర్తింపు**
ఈ మధ్యకాలంలో చిట్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరుస ఆపరేషన్లతో ఉన్నతాధికారుల గుర్తింపు లభిస్తుంది. రెండు నెలల క్రితం చిట్వేలు ఎస్ఐ వినోద్ కుమార్ గంజాయి ముఠా గుట్టు రట్టు చేసి నిందితులను ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి చిట్వేలు తీసుకువచ్చారు. ఇటీవల ఒక కారు డ్రైవర్ను చితకబాది అడవిలో చేతులు కట్టేసి పాత కక్షలు మనసులో ఉంచుకొని చిత్రహింసలకు గురిచేసిన వారిని కూడా గుర్తించి రిమాండ్కు పంపించారు. ఇటీవల రైతులకు నిద్ర లేకుండా చేస్తున్న ట్రాన్ఫార్మర్ల లోని కాపర్ను చోరీ చేస్తున్న ముఠాను పట్టుకొని రిమాండ్కు పంపించారు. ఈ వరుస ఆపరేషన్లతో చిట్వేలు ఎస్ఐ వినోద్ కుమార్ ను సిఐ డి. శ్రీనివాసులు అభినందించారు.

# ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి అమానుషం!

- ప్రజాస్వామ్యంపై దాడిని సహించేది లేదు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మల్లిశెట్టి వెంకటరమణ తీవ్ర ఖండన



**చిట్వేల్(డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై పుంగనూరు నియోజకవర్గంలో జరిగిన దాడిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మల్లిశెట్టి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. మున్సిపాలిటీ నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతున్న సమయంలో ఎంపీపై దాడి జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులను ప్రజాబలంతో ఎదుర్కోవాలే తప్ప, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదని అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన పార్లమెంట్ సభ్యుడిపైనే దాడి జరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఎంపీకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలతో భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, దాడికి పాల్పడినట్లు నిర్ధారణ అయిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులతో వైఎస్సార్‌సీపీ గొంతును అణచలేరని, ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని మల్లిశెట్టి వెంకటరమణ స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో వైభవంగా ఆరో రోజు దసరా మహోత్సవాలు

-కాత్యాయనీ దేవి అలంకారంలో భ్రమరాంబాదేవి.. భక్తులకు విశేష దర్శనం

-హంసవాహనసేవ, పుష్పపల్లకీ సేవలతో ఆధ్యాత్మిక శోభ.. శాస్త్రోక్తంగా విశేష పూజలు







**డ్రీమ్ టైమ్స్ । (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 16:**
శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారిని కాత్యాయనీ దేవి స్వరూపంలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారగా, అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

**కాత్యాయనీ దేవి అలంకారంలో అమ్మవారు**
నవదుర్గలలో ఆరవ రూపమైన కాత్యాయనీ దేవి అలంకారంలో శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చతుర్భుజాలతో అభయహస్తం, వరదముద్ర, పద్మం, ఖడ్గాన్ని ధరించిన కాత్యాయనీ దేవి స్వరూపం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. కాత్యాయనీ దేవిని ఆరాధించడం వల్ల భక్తులకు రోగాలు, శోకాలు, భయాల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. జన్మజన్మల పాపాలు తొలగి, సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని పురాణాలు పేర్కొన్నాయి. శ్రీకృష్ణుడిని భర్తగా పొందాలనే సంకల్పంతో గోపికలు కాత్యాయనీ దేవిని ఆరాధించినట్లు పురాణగాథలు చెబుతున్నాయి.

**అమ్మవారికి విశేష పూజలు, చండీహోమం**
ఆరో రోజు ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలతో పాటు విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానాలతో పాటు చండీ పారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించారు. అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం కూడా జపాలు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం వంటి విశేష పూజలు కొనసాగాయి.

**నవరాత్రి సంప్రదాయంలో కుమారీపూజకు ప్రత్యేక స్థానం**
దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహించిన కుమారీపూజ భక్తులలో విశేష భక్తిభావాన్ని నింపింది. రెండు నుంచి పది సంవత్సరాల వయస్సు గల బాలికలను అమ్మవారి స్వరూపాలుగా భావించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజించడం ఈ సంప్రదాయంలోని విశిష్టత. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని బాలికల రూపంలో ఆరాధించడం ద్వారా దైవానుగ్రహం లభిస్తుందని భక్తులు విశ్వసించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆధ్యాత్మిక ప్రాధాన్యతను చాటిచెప్పిన ఈ పూజలు సంప్రదాయ వైభవానికి ప్రతీకగా నిలిచాయి.

**హంసవాహనసేవతో ఆధ్యాత్మిక వైభవం**
దసరా మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శ్రీ స్వామిఅమ్మవార్లకు హంసవాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హంసవాహనంపై కొలువుదీర్చి పూజాదికాలు నిర్వహించారు. హంసవాహనంపై స్వామిఅమ్మవార్ల దర్శనం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేదమంత్రాలు, పూజలు, సంప్రదాయ ఆచారాల మధ్య నిర్వహించిన ఈ వాహనసేవలు శ్రీశైల క్షేత్ర ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ఇనుమడింపజేశాయి.

**పుష్పపల్లకీ సేవతో పుష్పశోభ**
శుక్రవారం రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పుష్పపల్లకీ సేవ నిర్వహించారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించిన పల్లకిలో స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చి మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ విశేష సేవలో ఎర్రబంతి, పసుపు బంతి, తెల్ల చామంతి, పసుపు చామంతి, కనకాంబరాలు, డచ్ రోజాలు, గ్లాడియోలస్, కార్నేషన్లు, ఆర్కిడ్స్, నందివర్ధనం తదితర పుష్పాలతో పాటు వివిధ ఆకులను వినియోగించారు. పుష్పాలతో అలంకరించిన పల్లకిలో స్వామిఅమ్మవార్ల ఊరేగింపు భక్తులకు కనులవిందుగా నిలిచింది.
అదేవిధంగా రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీపూజలు, రాత్రి 10 గంటలకు కాళరాత్రి పూజ నిర్వహించారు.

**భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ఉత్సవాల నిర్వహణ**
శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలను భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతిరోజూ ప్రత్యేక అలంకారాలు, పూజలు, హోమాలు, వాహనసేవలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఉత్సవాలకు మరింత వైభవాన్ని తీసుకొచ్చారు. భక్తులకు అమ్మవారి దర్శనం, పూజల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తూ క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంలో దేవస్థానం చేసిన ఏర్పాట్లు విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కాత్యాయనీ దేవి అలంకారం, హంసవాహనసేవ, పుష్పపల్లకీ సేవలతో శ్రీశైలంలో ఆరో రోజు దసరా మహోత్సవాలు భక్తిభావంతో, వైభవోపేతంగా కొనసాగాయి.

# బిజినెస్

## మహీంద్రా కార్లపై పండుగ ధమాకా..

-రూ.1.5 లక్షల వరకు ప్రయోజనాలు!
-నెలాఖరు వరకే ప్రత్యేక ఆఫర్లు
-ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పెట్రోల్‌పై రూ.60 వేల వరకు తగ్గింపు
-డీజిల్ మోడల్‌పై రూ.25 వేల వరకు ప్రయోజనాలు
-స్కార్పియో క్లాసిక్‌పై నగదు తగ్గింపు, యాక్సెసరీలు
-స్కార్పియో ఎన్ టాప్ వేరియంట్‌పై రూ.1.5 లక్షల బెనిఫిట్స్
-థార్ ఫోర్ వీల్ డ్రైవ్‌పై రూ.80 వేల వరకు ఆఫర్లు
-ఎలక్ట్రిక్ ఎక్స్‌యూవీ 400పై రూ.లక్ష వరకు నగదు తగ్గింపు
-ఎంపిక చేసిన మోడళ్లకే పండుగ ఆఫర్లు వర్తింపు




న్యూఢిల్లీ
పండుగ సీజన్ సందర్భంగా ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా ఎంపిక చేసిన కార్లపై ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ నెలాఖరు వరకు అందుబాటులో ఉండే ఈ ఆఫర్లలో మోడల్, వేరియంట్‌ను బట్టి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చు. మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పెట్రోల్ మోడల్‌పై రూ.60 వేల వరకు, డీజిల్ మోడల్‌పై రూ.25 వేల వరకు ప్రయోజనాలు అందిస్తోంది. స్కార్పియో క్లాసిక్‌పై రూ.25 వేల నగదు తగ్గింపుతో పాటు రూ.20 వేల విలువైన యాక్సెసరీలను అందిస్తోంది. స్కార్పియో ఎన్ జెడ్8ఎల్ ఫోర్ వీల్ డ్రైవ్ ఆటోమేటిక్ వేరియంట్‌పై గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ప్రయోజనాలు ప్రకటించింది. థార్ ఫోర్ వీల్ డ్రైవ్ వెర్షన్‌పై రూ.80 వేల వరకు బెనిఫిట్స్ అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఎక్స్‌యూవీ 400 ఈఎల్ ప్రో వేరియంట్‌పై రూ.లక్ష వరకు నగదు తగ్గింపు ప్రకటించింది. ఈ ఆఫర్లు ఎంపిక చేసిన మోడళ్లు, వేరియంట్లకు మాత్రమే వర్తిస్తాయి. డీలర్‌షిప్, వాహన లభ్యతను బట్టి ప్రయోజనాల్లో మార్పులు ఉండవచ్చు. కారు కొనుగోలు చేయాలనుకునే వారు ఆఫర్ల గడువు, వర్తించే నిబంధనలను సంబంధిత డీలర్ వద్ద నిర్ధారించుకోవాలి.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

**-సెన్సెక్స్ 413 పాయింట్లు లాభం**



భారత్ స్టాక్ మార్కెట్ వరుసగా లాభాలబాటలో సాగింది. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 413 పాయింట్లు లాభపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 148 పాయింట్ల లాభాలు చవిచూసింది. అంతకుముందు గురువారం స్టాక్ మార్కెట్ అత్యధికంగా 1500 పాయింట్లపైగా లాభపడిన సంగతి తెలిసిందే. శుక్రవారం టెక్నాలజీ, ఐటీ, మెటల్ షేర్ల కొనుగోళ్లకు మద్దతు లభించడంతో మార్కెట్ లాభాలబాటలో సాగింది.ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 413.66 పాయింట్లు (0.56 శాతం) లాభపడి, 74,729.27 వద్ద ముగిసింది. అంతకుముందు ఒక దశలో 74,778.78 పాయింట్ల గరిష్టాన్ని తాకి, 765.79 పాయింట్ల స్థాయికి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 148.80 పాయింట్ల (0.65 శాతం) లాభంతో 23,146.15 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ మాత్రం నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 65.74 పాయింట్లు నష్టపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 12.63 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా 3.92 శాతం లాభపడింది. మరోవైపు రూపాయి స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.95గా ఉంది. బంగారం ఔన్స్ ధర 4,197 డాలర్లుగా ఉంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 105.61గా కొనసాగింది. ఇక, బీఎస్ఈ 30 ఇండెక్స్‌లో టెక్ మహీంద్రా అత్యధికంగా 8.45 శాతం లాభపడింది. ఆ తర్వాత టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ లాభపడ్డాయి. అయితే, బీఈఎల్, రిలయన్స్, ఐటీసీ, ఏసియన్ పెయింట్స్, ఇండిగో షేర్లు నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా ఇండిగో 2.23 శాతం నష్టపోయింది.

## నిలకడగా బంగారం, వెండి ధరలు

**-హైదరాబాద్‌లో మార్పులేని పసిడి ధరలు**
**-24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,47,400**
**-22 క్యారెట్ల పది గ్రాముల ధర రూ.1,35,150**
**-కిలో వెండి ధర రూ.2.40 లక్షలు**
**-మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరల్లో మార్పులు**
**-కొనుగోలుకు ముందు తాజా ధరలు తెలుసుకోవాలని సూచన**




హైదరాబాద్
నగరంలో బంగారం, వెండి ధరలు శుక్రవారం స్థిరంగా కొనసాగాయి. గత ధరలతో పోలిస్తే పసిడి, వెండి రేట్లలో గణనీయమైన మార్పులు కనిపించలేదు. దీంతో కొనుగోలుదారులు తాజా ధరలను పరిశీలిస్తూ ఆభరణాల కొనుగోలుపై నిర్ణయం తీసుకుంటున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,47,400గా ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,35,150 వద్ద కొనసాగుతోంది. కిలో వెండి ధర సుమారు రూ.2,40,000గా ఉంది. బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, మార్కెట్ పరిస్థితులను బట్టి ఎప్పుడైనా మారే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరల కదలికలు, డాలర్ మారకం విలువ, పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రపంచ ఆర్థిక పరిణామాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతాయి. అదేవిధంగా వెండికి పారిశ్రామిక రంగం నుంచి ఉండే డిమాండ్, అంతర్జాతీయ సరఫరా పరిస్థితులు, పెట్టుబడుల ప్రవాహం కూడా ధరల హెచ్చుతగ్గులకు కారణమవుతాయి. పండుగలు, శుభకార్యాల సమయంలో బంగారం కొనుగోళ్లకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఆభరణాలు కొనుగోలు చేసేవారు తమ బడ్జెట్‌కు అనుగుణంగా ధరలను పరిశీలిస్తున్నారు. బంగారం ధర స్థిరంగా ఉన్న రోజుల్లో కొనుగోలు నిర్ణయం తీసుకునే ముందు వివిధ నగల దుకాణాల్లో రేట్లను సరిపోల్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆభరణాల తయారీ ఛార్జీలు, వృథా శాతం, వర్తించే పన్నుల కారణంగా తుది బిల్లు మారవచ్చు. ఇక్కడ పేర్కొన్న ధరలు సుమారు మార్కెట్ రేట్లు మాత్రమే. నగల దుకాణం, స్వచ్ఛత, ఆభరణాల రూపకల్పన, అదనపు ఛార్జీలను బట్టి కొనుగోలు ధరలో తేడాలు ఉండవచ్చు. అందువల్ల బంగారం లేదా వెండి కొనుగోలు చేసే ముందు ఆ రోజు వర్తించే తాజా ధరను, బిల్లులోని వివరాలను సంబంధిత విక్రేత వద్ద నిర్ధారించుకోవాలి.

## అర్ష్‌దీప్‌కు గాయం..
## టీమిండియాలోకి భువనేశ్వర్!

**-వెస్టిండీస్‌తో ఐదో టీ20కి భువీ ఎంపిక**
**-నాలుగో మ్యాచ్‌లో బౌలింగ్ భుజానికి అర్ష్‌దీప్ గాయం**
**-సిరీస్‌లో 2--2తో సమంగా నిలిచిన ఇరు జట్లు**
**-నిర్ణయాత్మక పోరుకు సిద్ధమవుతున్న భారత్, వెస్టిండీస్**
**-అర్ష్‌దీప్ ఫిట్‌నెస్‌పై ఆధారపడనున్న తుది నిర్ణయం**
**-న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కూ ఎంపికైన భువనేశ్వర్**
**-36 ఏళ్ల వయసులో మళ్లీ భారత జట్టులో చోటు**
**-ఐదో టీ20పై అభిమానుల్లో ఆసక్తి**




ముంబై: భారత పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ మరోసారి టీమిండియా బృందంలో చోటు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌తో జరగనున్న ఐదో టీ20 మ్యాచ్ కోసం అతడిని జట్టులోకి తీసుకున్నారు. నాలుగో టీ20లో బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ గాయపడటంతో అతడి స్థానంలో అదనపు ఆటగాడిగా భువనేశ్వర్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. నాలుగో మ్యాచ్ సందర్భంగా అర్ష్‌దీప్‌కు బౌలింగ్ చేసే భుజానికి గాయమైంది. దీంతో అతడు ఐదో టీ20కి అందుబాటులో ఉంటాడా లేదా అన్నది సందేహంగా మారింది. మ్యాచ్ సమయానికి అతడి గాయం నుంచి కోలుకునే పరిస్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అర్ష్‌దీప్ ఆడలేని పరిస్థితి ఏర్పడితే భువనేశ్వర్ జట్టుకు సేవలందించనున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ప్రస్తుతం 2--2తో సమంగా ఉంది. దీంతో ఐదో మ్యాచ్ ఇరు జట్లకు కీలకంగా మారింది. ఈ నిర్ణయాత్మక పోరు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో రెండు జట్లు బరిలోకి దిగనున్నాయి. మరోవైపు, 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌ను అక్టోబర్ 22 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు కూడా ఎంపిక చేశారు. అనుభవజ్ఞుడైన ఈ పేసర్ తిరిగి జట్టులోకి రావడంతో భారత బౌలింగ్ విభాగానికి బలం చేకూరే అవకాశం ఉంది.

**భారత జట్టు:** శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివం దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, నమన ధీర్, భువనేశ్వర్ కుమార్.

## న్యూజిలాండ్ పర్యటనకు టీమిండియా జట్ల ప్రకటన

**-తొలి మూడు వన్డేలకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్**
**-చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్‌కు నాయకత్వ బాధ్యతలు**
**-టెస్టు జట్టుకూ గిల్ సారథ్యం**
**-వన్డేల్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు**
**-చివరి రెండు వన్డేలకు ప్రత్యేకంగా జట్టు ఎంపిక**
**-నవంబర్ 4 నుంచి ఐదు వన్డేల సిరీస్**
**-నవంబర్ 19 నుంచి రెండు టెస్టుల పోరు**
**-టెస్టు జట్టులోకి ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్**




న్యూఢిల్లీ:
న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా జరిగే వన్డే, టెస్టు సిరీస్‌లకు భారత జట్లను బీసీసీఐ ప్రకటించింది. ఐదు వన్డేల సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించనున్నాడు. రెండు టెస్టుల సిరీస్‌లోనూ గిల్ జట్టును నడిపించనున్నాడు. ఈ మేరకు అక్టోబర్ 16న బీసీసీఐ అధికారికంగా జట్ల వివరాలను వెల్లడించింది. వన్డే జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు కల్పించారు. తొలి మూడు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఉండనున్నాడు. నాలుగు, ఐదు వన్డేలకు ఇషాన్ కిషన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చివరి రెండు మ్యాచ్‌ల జట్టులో తిలక్ వర్మ, కుమార్ కుశాగ్ర, యశ్ ఠాకూర్‌లకు చోటు దక్కింది. టెస్టు జట్టులో ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్ తిరిగి స్థానం సంపాదించారు. జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తదితరులు కూడా జట్టులో ఉన్నారు. వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఎంపిక ఫిట్‌నెస్ అనుమతికి లోబడి ఉంటుందని బీసీసీఐ పేర్కొంది. ప్రసిద్ధ్ కృష్ణ వన్డే జట్టులో చోటు కూడా ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఉంది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ నవంబర్ 4న ఆక్లాండ్‌లో ప్రారంభమవుతుంది. రెండో వన్డే నవంబర్ 7న వెల్లింగ్టన్‌లో, మూడోది నవంబర్ 10న హామిల్టన్‌లో జరగనున్నాయి. చివరి రెండు మ్యాచ్‌లు నవంబర్ 13, 15 తేదీల్లో మౌంట్ మాంగనుయ్‌లో నిర్వహిస్తారు. టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్ నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో, రెండో టెస్టు నవంబర్ 27న క్రైస్ట్‌చర్చ్‌లో ప్రారంభం కానుంది

# స్పోర్ట్స్

## బుమ్రా కోసం బీసీసీఐ మాస్టర్ ప్లాన్..

-వన్డేలకు దూరం, కేవలం టెస్టులకే పరిమితం!
-వన్డేలకు దూరంగా జస్‌ప్రీత్ బుమ్రా
-టెస్టుల కోసం ప్రత్యేక వర్క్‌లోడ్ ప్లాన్
-ఇండియా 'ఎ' మ్యాచ్‌తో బుమ్రా రీ-ఎంట్రీ



భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి టీమిండియా మేనేజ్‌మెంట్ ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసింది. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా కివీస్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నుంచి బుమ్రాకు విశ్రాంతినిచ్చే ఆలోచనలో బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బుమ్రా పూర్తిగా ఫిట్‌గా ఉన్నప్పటికీ, కేవలం రెడ్-బాల్ (టెస్ట్) క్రికెట్‌పైనే పూర్తి దృష్టి పెట్టాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. వన్డే సిరీస్‌లో అనవసరంగా శ్రమించడం కంటే, టెస్టు సిరీస్‌కు అతడిని పూర్తిగా తాజాగా ఉంచడమే ప్రధాన ఉద్దేశమని సమాచారం.ఈ ప్లాన్‌లో భాగంగా, నవంబర్ 6 నుంచి ప్రారంభం కానున్న మూడో ఇండియా 'ఎ' మ్యాచ్‌లో బుమ్రా ఆడే అవకాశం ఉంది. ఆ మ్యాచ్ ముగిసిన తర్వాత నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్ వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్టుకు ముందు అతడికి తగినంత సమయం లభిస్తుంది. ప్రస్తుతం అహ్మదాబాద్‌లో రెడ్-బాల్ ప్రాక్టీస్ ప్రారంభించిన బుమ్రా, ఈ నెల చివర్లో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కి చేరుకుని అక్కడి నుంచి నేరుగా న్యూజిలాండ్‌కు పయనం కానున్నాడు. భవిష్యత్తులో జరగబోయే ప్రతిష్టాత్మక టోర్నీలను దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ) సిరీస్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని బుమ్రా వర్క్‌లోడ్‌ను మేనేజ్ చేస్తున్నారు. ప్రాముఖ్యత లేని ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల కోసం బుమ్రాను అలసిపోయేలా చేయకుండా, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారు. జట్టుకు ప్రధాన పేస్ అస్త్రమైన బుమ్రాను ఫిట్‌గా ఉంచడమే సెలెక్టర్ల ప్రథమ ప్రాధాన్యతగా మారింది.మరోవైపు, న్యూజిలాండ్ టూర్‌కు సంబంధించిన భారత్ వన్డే, టెస్ట్ జట్లను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, రిషబ్ పంత్ వంటి కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్ అప్‌డేట్స్ కోసం సెలెక్టర్లు ఎదురుచూస్తున్నారు. రాబోయే సుదీర్ఘ టెస్ట్ సిరీస్‌లను విజయవంతంగా ముగించేందుకు భారత మేనేజ్‌మెంట్ ముందస్తుగా కసరత్తులు వేగవంతం చేసింది.



ఈ అందానికి దాసోహం కానీ కుర్రహృదయం ఉంటుందా..

# రా అండ్ రస్టిక్ యాక్షన్ లవ్ స్టోరీతో రానున్న 'డానీ'..

-నవంబర్ 13న గ్రాండ్ రిలీజ్!




టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ హీరో ఆశిష్ గాంధీ, టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్‌జీ గోగణ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అంటెసిపేటెడ్ మూవీ 'డానీ'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'నాటకం' సినిమా ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే జోరుతో అంతకుమించిన ఇంటెన్సివ్ కంటెంట్‌తో ఈ కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్, క్రైమ్, రా అండ్ రస్టిక్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంపై ట్రేడ్ సర్కిల్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ స్ట్రైక్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. సినిమాలోని బోల్డ్ కంటెంట్, రా అండ్ రస్టిక్ మేకింగ్ స్టైల్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా, మనిషి జీవితంలో ఉండే అలవాట్లకు, అతను మనసారా కోరుకునే ప్రేమకు మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణే ఈ చిత్రానికి ప్రధాన హైలైట్ కానుంది. ఓ వ్యక్తి తన జీవితంలో అలవాటు చేసుకున్న పద్ధతులు అతని గమ్యభావితాన్ని ఎలా మార్చాయి? ఆ వ్యక్తి నిజమైన ప్రేమలో పడిన తర్వాత తన జీవితంలో ఎలాంటి పెనుమార్పులు వచ్చాయి? ఈ రెండు విభిన్నమైన ధోరణుల మధ్య నలిగిపోయే పాత్రల ప్రయాణం ఎలా సాగిందనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమాను అత్యంత సహజంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆశిష్ గాంధీ సరసన సేజల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తుండగా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. హీరో హీరోయిన్ల డిఫరెంట్ లుక్స్, పోస్టర్ డిజైన్ తీరు సినిమా నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ, మణికాంత్ ఎడిటింగ్ బాధ్యతలు అద్భుతంగా నిర్వర్తించారు. కొల్లి గోపాల కృష్ణ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ఖుషి, సుధాకర్ గోడ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ తోట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, రామ్ సుంకర మరియు కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రఫీ అందించగా, సాయిరామ్ జల్లా కో-డైరెక్టర్‌గా సేవలందించారు. రిథమ్ స్టూడియోస్ సౌండ్ డిజైన్ చేయగా, కోటి వర్క్స్ పబ్లిసిటీ డిజైన్స్ అందించారు. సాయి సతీష్ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ రా అండ్ రస్టిక్ రొమాంటిక్ క్రైమ్ డ్రామా 'డానీ' సినిమాను ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 13న ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# సెట్స్‌పైకి 'కల్కి-2'



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న సైన్స్‌ఫిక్షన్ 'కల్కి 2898ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా రెండో భాగం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. సీక్వెల్‌ను అక్టోబర్ రెండోవారంలో సెట్స్‌పైకి తీసుకొస్తున్నామని దర్శకుడు నాగ్‌అశ్విన్ గతంలోనే వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం గురువారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైందని, ఇందులో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్నారని తెలిసింది. హైదరాబాద్‌లోనే భారీ షెడ్యూల్‌కు ప్లాన్ చేసినట్లు తెలిసింది. సీక్వెల్‌లో కథా పరిధి మరింత పెద్దగా ఉంటుందని, విజువల్ ఎఫెక్ట్స్ అబ్బురపరుస్తాయని అంటున్నారు. ఈ సినిమా నుంచి దీపికా పదుకోన్ తప్పుకోవడంతో ఆమె స్థానంలో సాయిపల్లవి నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. 'కల్కి' తొలిభాగం వెయ్యికోట్ల పైచిలుకు వసూళ్లతో సంచలనం సృష్టించడంతో సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# వాటి గురించి ఇప్పుడే చెప్పలేను

సాధారణంగా ఎక్కువమంది హీరోయిన్లు 'మేం తింటాం కానీ వంట చేయలేం' అంటుంటారు. కానీ శ్రీలీల మాత్రం ఎలాంటి వంటనైనా ఈజీగా చేసేస్తానంటున్నది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తనలోని పాకశాస్త్ర నైపుణ్యం గురించి శ్రీలీల మాట్లాడింది. 'నాకు సాంబారు, కొబ్బరన్నం, కుర్మాకూర.. ఇలా చాలా వంటలు వచ్చు. అయితే.. ఎలాంటి వెరైటీ వండినా.. పెరుగన్నం మాత్రం నా మెనూలో పక్కగా ఉండాల్సిందే. చిన్నప్పట్నుంచీ పెరుగన్నమంటే చాలా ఇష్టం' అని శ్రీలీల పేర్కొన్నారు. సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదేంటి? అనడిగితే.. 'గత కొన్ని రోజులుగా షూటింగులతో బిజీగా ఉన్నాను. నేను చేస్తున్న సినిమాలకు చెందిన వివరాల గురించి యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించలేదు. అందుకే ఆ సినిమాల గురించి నేను ఇప్పుడే చెప్పలేను. ప్రస్తుతానికైతే రెండ్రోజులు బ్రేక్ దొరికింది. ఈ విలువైన సమయాన్ని ఫ్యామిలీతో స్పెండ్ చేస్తున్నా' అంటూ చెప్పుకొచ్చారు శ్రీలీల

# నిధి అన్వేషణలో 'వృషకర్మ'



అగ్ర కథానాయకుడు నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. మీనాక్షి చౌదరి కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో కలిసి అగ్ర దర్శకుడు సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ గురువారం మేకర్స్ ఓ ప్రకటనను విడుదల చేశారు. విడుదలకు ఇంకా 50రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఓ సరికొత్త పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. హై స్టైలిష్‌గా, యాక్షన్ అవతార్‌లో పదునైన కత్తులు అమర్చబడ్డ ఓ లోహపు తాడును ఆయుధంగా చేతబట్టి కనిపిస్తున్న నాగచైతన్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆయన చుట్టూ ఉన్న వాతావరణం తుఫానుని తలపిస్తున్నది. నిధి అన్వేషణ నేపథ్యంలో మైథాలజీ, అడ్వెంచర్ అంశాలతో.. ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో భారీ స్థాయిలో ఈ సినిమా తెరకెక్కుతున్నదని మేకర్స్ తెలిపారు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ప్రీరిలీజ్ బిజినెస్ కూడా భారీగా జరిగిందని మేకర్స్ చెప్పారు. స్పర్ష్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాగుల్ డి.హెరియన్, సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్.

# హాలీవుడ్ విజువల్ ఫీస్ట్ 'నార్నియా' ట్రైలర్ వచ్చేసింది.!




ప్రముఖ హాలీవుడ్ దర్శకురాలు బార్బీ ఫేమ్ గ్రెటా గెర్విగ్ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక ఫాంటసీ చిత్రం 'నార్నియా: ది మెజీషియన్స్ నెఫ్యూ'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. సీ.ఎస్. లూయిస్ రాసిన ప్రసిద్ధ నవల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంపై సినిమా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మాయాజాలం, ఉత్కంఠభరిత సన్నివేశాలు మరియు అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకులను మరో అద్భుత లోకంలోకి తీసుకెళ్లేందుకు ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమా 2027 ఫిబ్రవరి 12న ఇండియాలో ఘనంగా థియేటర్లలో విడుదల కాబోతుంది. ఈ చిత్ర ట్రైలర్‌లో నార్నియా అనే అద్భుత ప్రపంచాన్ని అత్యంత సుందరంగా పరిచయం చేశారు. ఈ సినిమాలో డేవిడ్ మెక్‌కెన్నా డిగరీ కిర్క్ పాత్రలో, బీట్రైస్ క్యాంప్‌బెల్ పాలీ ప్లమ్మర్ పాత్రలో నటిస్తున్నారు. వీరిద్దరి సాహసోపేత ప్రయాణమే నార్నియా అనే మాయా ప్రపంచంలోకి దారితీస్తుంది. అలాగే ఎమ్మా మాకీ యువ జాడిస్ పాత్రలో, అనుభవజ్ఞుడైన నటుడు డేనియల్ క్రెయిగ్ అంకుల్ ఆండ్రూ పాత్రలో అలరించనున్నారు. వీరితో పాటు కేరీ ముల్లిగన్, కోబ్నా హోల్డ్‌బ్రూక్-స్మిత్, ప్రఖ్యాత నటి మెరిల్ స్ట్రీప్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'బార్బీ' వంటి ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయం సాధించిన చిత్రాన్ని అందించిన ప్రతిభావంతురాలైన గ్రెటా గెర్విగ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన ట్రైలర్‌తో చిత్రంలోని పాత్రలు మరియు కథా ప్రపంచంపై ప్రేక్షకులకు మరింత స్పష్టత వచ్చింది. సీ.ఎస్. లూయిస్ రచించిన 'ది క్రానికల్స్ ఆఫ్ నార్నియా' పుస్తకాల ప్రచురణ క్రమంలో 'ది మెజీషియన్స్ నెఫ్యూ' ఆరో పుస్తకమైనప్పటికీ, కథాక్రమం ప్రకారం ఇది ప్రసిద్ధ చిత్రం 'ది లయన్, ది విచ్ అండ్ ది వార్డ్‌రోబ్'కు ముందు జరిగే సంఘటనలను వివరిస్తుంది. అసలు నార్నియా ప్రపంచం ఎలా ఆవిర్భవించిందనే ప్రధానాంశాన్ని ఈ చిత్రం కళ్లకు కట్టినట్లు చూపించనుంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ రిలీజింగ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేస్తోంది. నార్నియా కొత్త లోకాన్ని అనుభవించడానికి ప్రేక్షకులు 2027 ఫిబ్రవరి 12 వరకు వేచి చూడాల్సిందే.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831